## అలా చేస్తే.. కేంద్రం ఇజ్జత్ పోయేది

**కరీంనగర్ జిల్లా:** కాళేశ్వరం విషయంలో ఏం జరుగుతుందో అందరికీ తెలిసిందేనని.. కేసీఆర్ కుటుంబానికి రేవంత్ ప్రభుత్వం రక్షణ కవచంలా మారిపోయిందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఏ ఒక్క స్కాంలో కూడా కనీస చర్యలు లేకపోవడమే అందుకు సాక్ష్యమన్నారు. అందుకే.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని తెలంగాణా ప్రజలు డిసైడ్ అయ్యారని బండి సంజయ్ చెప్పుకొచ్చారు. "కాళేశ్వరం కేసీఆర్ కుంటుంబానికి ఏటీఎంలా మారింది. నిజాయితీగా పదకొండేళ్ల నుంచి పాలన చేస్తోన్న మోదీ నుంచి అమిత్ షా అందరూ అదే చెప్పారు. కాళేశ్వరం అవినీతి, అక్రమాలతో కూడిన ప్రాజెక్ట్. కాళేశ్వరం ప్రాజెక్టులో పని చేసిన అధికారులే వందల కోట్లు సంపాదించుకున్నారు.



ప్రభాత

# సూర్య

PRABHATA SURYA

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

వేల రూ.5/ - పేజీలు : 8 సోమవారం 23 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 46



విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news



PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





# సర్వే నంబర్లు గల్లంతు!

- 1.26 లక్షల.. సర్వే నంబర్ల మాయంపై భూభారతి సదస్సుల్లో రైతుల ఫిర్యాదు
- 8 లక్షల దరఖాస్తుల్లో ఈ తరహావి 15%
- ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు కాని వైనం
- సాదాబైనామాల కింద రిజిస్ట్రేషన్లు కోరిన వారు 2.42 లక్షలు

సూర్య న్యూస్ హైదరాబాద్

ఒకటి కాదు...రెండు కాదు.. రాష్ట్రంలోని వ్యవసాయ భూములకు సంబంధించిన లక్షకు పైగా సర్వే నంబర్లు గల్లంతయ్యాయి. పాత రికార్డుల్లో ఉన్నా కొత్త రికార్డుల్లోకి ఇవి ఎక్కలేదు. ధరణికి ముందున్న మాన్యువల్ రికార్డుల్లో నమోదైన ఈ సర్వే నంబర్లన్నీ ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న తమ భూముల సర్వే నంబర్లు కనిపించకపోవడంతో ఆయా సర్వే నంబర్లలో భూమి ఉన్న రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకపోవడం, సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన భూభారతి సదస్సుల్లో ఈ రైతులందరూ మరోమారు దరఖాస్తు - మిగతా2లో



## నక్సల్స్‌ను వర్షాకాలంలోనూ నిద్రపోనీయం


- ఆయుధాలు వదిలి జనజీవన ప్రవంతిలో కలవాలని విజ్ఞప్తి
- ప్రతిసారి రుతుపవనాల సీజన్‌లో సహజంగా నక్సల్స్ రెస్ట్ తీసుకుంటూ ఉంటారని,
- కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా



## కలిసి పనిచేస్తేనే లాభం!

- పొరుగు దేశాలకు జైశంకర్ సూచన
- ఏ దేశంతోనైనా పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పుడు చేతులెత్తేయకూడదు
- చైనాతో చాలా సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయి
- వాటిని ఎదుర్కోవడానికి మన సామర్థ్యాలను పెంచుకోవాల్సి వచ్చింది

# 'రేషన్'కు 76,842 మంది అనర్హులు



- ఇకపై వారికి కోటా నిలిపివేత
- గత 6 నెలల్లో రేషన్ తీసుకోనివారి వివరాలను పరిశీలించిన అధికార యంత్రాంగం
- లబ్ధిదారుల్లో 76,842 మంది అనర్హులుగా తేలిన లెక్క
- ఈ వివరాలను జిల్లాలవారీగా కలెక్టర్లకు పంపిన పౌర సరఫరాలశాఖ

సూర్య న్యూస్ హైదరాబాద్

రాష్ట్రంలో అనుమానాస్పద రేషన్ కార్డులపై క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియ పూర్తయింది. గత 6 నెలల్లో రేషన్ తీసుకోనివారి వివరాలను అధికార యంత్రాంగం పరిశీలించింది. ఈ మేరకు లబ్ధిదారుల్లో 76,842 మంది అనర్హులుగా లెక్క తేలింది. ఈ వివరాలను పౌర సరఫరాలశాఖ జిల్లాలవారీగా కలెక్టర్లకు పంపించింది. కొద్ది - మిగతా2లో



## పన్నేతర ఆదాయం పెరగాలి

- గత ప్రభుత్వ పథకాలను ఒక్కటీ ఆపలేదు
- రూ.33,600 కోట్లతో కొత్త సంక్షేమ కార్యక్రమాలు
- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




## స్థానిక ఎన్నికల్లో పంచాయతీ సంఘటన్ కీలకం

- పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యతను ఆ ప్రతినిధులు తీసుకోవాలి
- కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు పార్టీ పట్ల సానుకూలంగా ఉన్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై క్షేత్రస్థాయిలో విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించడానికి సంఘటన్ ప్రతినిధులు తోడ్పడాలి
- ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్

సూర్య న్యూస్ హైదరాబాద్

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ సంఘటన్ కీలక పాత్ర పోషించాల్సి ఉందని ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై క్షేత్రస్థాయిలో విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించడానికి సంఘటన్ ప్రతినిధులు తోడ్పడాలని సూచించారు. కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు పార్టీ పట్ల సానుకూలంగా ఉన్నారని చెప్పారు. ఆదివారం - మిగతా2లో

## ఆ విమానాలు నిలిపివేయడమే మంచిది

- ఎయిర్ ఇండియా బోయింగ్ 787%-%8 విమానాలపై అత్యధికుల ఆందోళన
- సమస్యలు పరిష్కారమయ్యేవరకు నిలిపివేయాలని 56 శాతం మంది సూచన
- అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడి






## నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- ఆర్వోబీలు, మెడికల్ కాలేజీలు, టిమ్స్‌పై దృష్టి పెట్టండి
- అధికారులకు మంత్రి కోమటి రెడ్డి ఆదేశాలు

# ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్

- ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్ అణుకేంద్రాలపై బంకర్ బస్టర్ బాంబులేసిన ట్రంప్ సేన
- ఇస్ఫహాన్ అణుకేంద్రంపై టోమాహాక్ క్రూజ్ క్షిపణులతో దాడి
- చరిత్రచూడని స్థాయిలో ప్రతిదాడిచేస్తామన్న ఇరాన్
- ఇరాన్ యుద్ధం ఆపకుంటే మళ్లీ దాడిచేస్తామన్న ట్రంప్
- అమెరికా జోక్యంతో భగ్గుమన్న ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధాగ్ని
- అగ్రరాజ్య దాడిని ఖండించిన ప్రపంచదేశాలు



సూర్య న్యూస్ వాషింగ్టన్/న్యూఢిల్లీ/మాస్కో:

పచ్చగడ్డి వేస్తే భగ్గున మండే శత్రుత్వంతో పరస్పర దాడులు చేసుకుంటున్న ఇరాన్, ఇజ్రాయెల్ మధ్యలోకి అగ్రరాజ్యం హఠాత్తుగా వచ్చి భీకరదాడులతో పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలను మరింత ఎత్తుకు ఎగదోసింది. పర్వత గర్భంలో పటిష్టంగా, రహస్యంగా ఉన్న ఫోర్డో యురేనియం శుద్ధి కర్మాగారాన్ని బద్దలుకొట్టే లక్ష్యంతో అమెరికా యుద్ధవిమానాలు వేల కేజీల బరువైన అతిభారీ బాంబులతో విరుచుకుపడ్డాయి. ఇరాన్ రాజధాని సమీప ఫోర్డో అణుకేంద్రంపై శనివారం అర్ధరాత్రిదాటాక గంటలకు జీబీయూ-57 ఏ/బీ మ్యాసివ్ ఆర్డ్‌నెన్స్ పెనిట్రేటర్(ఎంఓపీ) గైడెడ్ బాంబులను - మిగతా2లో

# సర్వే నంబర్లు గల్లంతు!

-మొదటిపేజీ తరువాయి

చేసుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలోని 561 మండలాల్లో ఉన్న 10,239 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన ఈ సదస్సుల్లో మొత్తం 8,00,999 దరఖాస్తులు రాగా, అందులో తమ భూముల సర్వే నంబర్లు మిస్సయ్యాయంటూ ఏకంగా 1,26,028 దరఖాస్తులు రావడం గమనార్హం. మొత్తం దరఖాస్తుల్లో 15 శాతం సర్వే నంబర్ల మిస్సింగ్ దరఖాస్తులే కావడం గమనార్హం. రెవెన్యూ రికార్డులకు సంబంధించి కీలకమైన, భూమి గుర్తింపు సంఖ్య అయిన సర్వే నంబరే లేకుండా పోవడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

**మొత్తం 8 లక్షలకు పైమాటే**

రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం పేరిట ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చి నాలుగేళ్లు దాటిపోయింది. ఆ పోర్టల్‌ను రద్దు చేసి భూభారతి అమల్లోకి తెచ్చి కూడా రెండు నెలలయింది. కానీ రాష్ట్ర రైతాంగం చేతిలో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించి ఇంకా లెక్కలేనన్ని సమస్యలు మిగిలి ఉన్నాయని భూభారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గ్రామస్థాయిలో జరిగిన ఈ సదస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షలకు పైగా వినతులు రావడం గమనార్హం. ఇందులో ఎక్కువగా సాదా బైనామాల రిజిస్ట్రేషన్ల దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో 30 శాతం దరఖాస్తులు ఇవే కావడం గమనార్హం. కాగా సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవసరమైన నిబంధనలను భూభారతి చట్టంలో పెట్టినా..ఈ అంశం కోర్టులో పెండింగ్ ఉండడంతో అవి రెగ్యులరైజ్ చేసేందుకు వీలు కాలేదు. కోర్టులో కేసు ముగిసిన తర్వాత ఆగస్టు నెలలో వీటన్నింటినీ పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆ తర్వాత సర్వే నంబర్ల మిస్సింగ్, అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డుల సమస్యలు, ఆ భూములను తమకు క్రమబద్ధీకరించాలంటూ వచ్చిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. అసైన్డ్ భూముల రెవెన్యూ రికార్డులకు సంబంధించి 90 వేలకు పైగా దరఖాస్తులు రాగా, ఆ భూములను తమకు రిజిస్ట్రేషన్ చేయాలంటూ మరో 50 వేల దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత వారసత్వం (విరాసత్) ద్వారా వచ్చిన భూమిని భాగస్వామ్య పంపకం చేయాలంటూ ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. అయితే భూభారతి పోర్టల్ ద్వారా ఈ భాగస్వామ్య పంపకాలకు అవకాశం కల్పించలేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఇక మ్యుటేషన్ పెండింగ్/కోర్టు కేసులు, డిజిటల్ సంతకం పెండింగ్, విస్తీర్ణంలో తేడాలు.. ఇలా రెవెన్యూ రికార్డులకు సంబంధించి 13 రకాలు, ఇతర సమస్యలకు సంబంధించిన 17 రకాల దరఖాస్తులు ఇటీవల జరిగిన భూభారతి సదస్సుల్లో రావడం గమనార్హం. మొత్తం దరఖాస్తుల్లో 3.2 లక్షలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు కాగా మిగిలిన దరఖాస్తులను కూడా నమోదు చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది.

**ఖమ్మంలో ఎక్కువ..మేడ్చల్‌లో తక్కువ**

జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా ఖమ్మం జిల్లా రైతాంగం ఎక్కువగా భూమి సమస్యలు ఎదుర్కొంటున్నట్టు భూభారతి సదస్సుల్లో వచ్చిన గణాంకాలు చెబుతున్నాయి. ఈ జిల్లాలో అత్యధికంగా 67,378 దరఖాస్తులు రాగా, ఆ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 61,145 దరఖాస్తులు వచ్చాయి. అంటే ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 1.28 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం వచ్చిన 8 లక్షల దరఖాస్తుల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే 15 శాతం కంటే ఎక్కువ దరఖాస్తులు రావడం గమనార్హం. ఆ తర్వాత వరంగల్ (54,933), భూపాలపల్లి (48,651), సూర్యాపేట (44,501), సిద్దిపేట (42,639), నల్లగొండ (42,161) జిల్లాల్లో ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఇక అత్యల్పంగా మేడ్చల్%–%మల్కాజిగిరి జిల్లాలో 2,857 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 10 వేల కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన జిల్లాల్లో ఆసిఫాబాద్ (3,712), మహబూబ్‌నగర్ (9,610), నారాయణపేట (4,052), రాజన్న సిరిసిల్ల (6,965), వనపర్తి (7,615) ఉన్నాయి.

**ఆగస్టు 15 నాటికి సమస్యల నుంచి విముక్తి**

భూభారతి సదస్సులను చాలా పకడ్బందీగా నిర్వహించాం. అధికారులే గ్రామాలకు వెళ్లి, ప్రజలకు ఒకరోజు ముందే దరఖాస్తులు ఇచ్చి, అన్ని వివరాలను తీసుకున్నారు. రూపాయి ఖర్చు లేకుండా రైతులు తమ భూ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసుకునే అవకాశాన్ని కల్పించడం సంతోషంగా ఉంది.

# నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

హైదరాబాద్

రహదారుల, భవనాల (ఆర్ అండ్ బీ) శాఖ పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సచివాలయంలో ఆ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. త్వరగా పూర్తయి వాడుకలోకి వచ్చేవాటికి మొదటి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న 5 జిల్లా సమీకృత కార్యాలయాల (ఆదిలాబాద్, వరంగల్, ములుగు, నారాయణపేట, కరీంనగర్) పనుల పురోగతిపై మంత్రి ఆరా తీయగా.. పెండింగ్ బిల్లుల అంశాన్ని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పనులు తుది దశలో ఉన్న వరంగల్, ములుగు జిల్లా కలెక్టరేట్లు వెంటనే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు. ఆర్వోబీల నిర్మాణంపై ఆరా తీసిన మంత్రి..నిజామాబాద్ మాధవనగర్ ఆర్వోబీ పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణం చివరి దశలోఉన్న ఆర్వోబీలు, మెడికల్ కాలేజీలు, టిమ్స్ హాస్పిటల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. వర్క్ ఏజెన్సీలకు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టితో మాట్లాడి క్లియర్ చేయిస్తానని మంత్రి భరోసా ఇచ్చారు

# లైవ్ లొకేషన్ తరహాలో తపాలా డిజిపిన్

**ప్రతి 16 చదరపు మీటర్లకు ప్రత్యేక డిజిటల్ పిన్ నంబర్**

**అత్యవసర సేవల్లో తక్షణ సాయం అందేందుకు దోహదం**

**ప్రభుత్వ విభాగాల పోర్టళ్లతో అనుసంధానించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తపాలా శాఖ విజ్ఞప్తి**

**ఇక ఇంటి చిరునామా స్థానంలో డిజిపిన్.. సులభంగా అడ్రస్ గుర్తించేందుకు వీలు**

హైదరాబాద్

డిజిటల్ పిన్ (డిజిపిన్) వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వ విభాగాలతో అనుసంధానించేందుకు రంగం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా తపాలాశాఖ ప్రతి 16 చదరపు మీటర్ల ప్రాంతానికి ప్రత్యేకంగా ఓ పిన్ నంబర్‌ను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఆ పిన్ నంబర్‌నే ఇప్పుడు రియల్‌టైమ్ లొకే షన్‌గా వాడుకునేలా తపాలాశాఖ గూగు ల్ మ్యాప్ ద్వారా అనుసంధానించింది. దీనిని వైద్యారోగ్య, పోలీసు, అగ్నిమాపక, రెవె న్యూ, మత్స్య తదితర శాఖలతో అనుసంధానిస్తారు. ఇది అత్యవసర సందర్భాల్లో ప్రజ లకు వీలైనంత తొందరలో సహాయం అందేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ మేరకు ఆయా శాఖలతో అనుసంధానించాలంటూ తాజాగా తెలంగాణ తపాలాశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

**ఏంటీ వ్యవస్థ?**

ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా తపాలాశాఖ ఆధ్వర్యంలో పిన్‌కోడ్ నంబర్లు ఉన్న విష యం తెలిసిందే. ఓ గ్రామానికో, పట్ట ణాలు/నగరాల్లోని కొంతభాగానికో ఒకటి చొప్పున ఈ పిన్‌కోడ్ నంబర్లు ఉన్నాయి. అది చాలా పెద్ద పరిధితో కూడిన ప్రాంతానికి ఉంటుంది. ఇప్పుడు అలా కాకుండా చిన్నచిన్న ప్రాంతానికి ఒక ప్రత్యేక పిన్ నంబర్ ఉండేవిధంగా తపాలాశాఖ డిజిపిన్ వ్యవస్థను రూపొందించిన విషయం తెలి సిందే. ఐఐటీ హైదరాబాద్, నేషనల్ రిమో ట్ సెన్సింగ్ ఏజెన్సీల సంయుక్తాధ్వర్యంలో దీనిని రూపొందించారు. దేశంలో ప్రతి 4 చదరపు మీటర్లు ఇంటూ 4 చదరపు మీటర్ల ప్రాంతానికి ప్రత్యేక డిజిటల్ పోస్టల్ ఇండెక్స్ నంబర్‌ను కేటాయించారు. దాన్ని అక్షాంశ రేఖాంశాల ఆధారంగా స్థిరీకరించి శాటిలైట్ ద్వారా అనుసంధానించారు. ఇప్పుడు గూగుల్‌తో దాన్ని అనుసంధానించారు. మనం ఎక్కడున్నా ఆ ప్రాంత డిజిపిన్‌ను గుర్తించొచ్చు. స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ఓపెన్ చేసి 'నో మై డిజిపిన్'అని టైప్ చేయగానే డిజిపిన్ యూఆర్‌ఎల్ ఓపెన్ అవుతుంది. దాన్ని క్లిక్ చేయగానే గూగుల్ మ్యాప్‌లో ఆ ప్రాంత డిజిపిన్ కనిపిస్తుంది. దాన్ని కంప్యూటర్/ల్యాప్‌టాప్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ప్రస్తుతం గూగుల్ మ్యాప్‌లో మన లొకేషన్ ఎలా కనిపిస్తుందో, అలాగే మనం ఉన్న ప్రాంత డిజిపిన్ కూడా కనిపిస్తుంది.




దేశం మొత్తాన్ని 16 గ్రిడ్లుగా విభజించారు. మళ్లీ ప్రతి గ్రిడ్‌ను 16 చిన్న గ్రిడ్లుగా విభజించారు. అలా పది లేయర్లుగా విభజిస్తూ చివరు 16 చదరపు మీ టర్ల ప్రాంతం వరకు విభజించారు. ప్రతి గ్రిడ్‌కు ఓ నంబరు కేటాయిస్తూ.. చివరకు 16 చదరపు మీటర్ల ప్రాంతానికి పది డిజిట్లతో కూడిన ఫైనల్ నంబరు కేటాయించారు. అదే తుది డిజిపిన్ నంబరు. ఇది ఇంచుమించు ప్రతి ఇంటికి కాస్త అటూ ఇటుగా ఓ పిన్ నంబరుగా ఉంటుంది. పెద్ద అపార్ట్‌మెంట్లు, విశాలమైన ప్రాంగణం ఉన్న వాటికి నాలుగైదు నంబర్లు ఉంటాయి. వాటిల్లో ఏ నంబరును వినియోగించినా... మన కచ్చితమైన చిరునామాను గుర్తించొచ్చు.

ఇక పార్శిల్స్, ఉత్తరాలను పోస్ట్/కొరియర్ చేసేప్పుడు నగరం, పట్టణం, కాలనీ, వీధి, ఇంటినంబరు... ఇలాంటివి ఏవీ లేకుండా వ్యక్తి పేరు, డిజిపిన్ రాస్తే ఎలాంటి వెతుకులాట లేకుండా కచ్చితంగా ఆ చిరునామాను గుర్తించొచ్చు. చిరునామాలో వ్యక్తిగత గోప్యత ఉండాలనుకునేవారు వారి వ్యక్తిగత చిరునామా ఇవ్వకుండా కేవలం డిజిపిన్ ద్వారా ఆ పార్శిల్‌ను ఇంటికి తెప్పించుకోవచ్చు.

మనం వేరే ప్రాంతంలో ఉన్నా, ఎక్కడ ఉన్నామో.. అవతలి వారికి తెలిపేందుకు ఈ డిజిపిన్‌ను వాడుకోవచ్చు.

భారీ వరదలు, అగ్ని, రోడ్డు ప్రమాదా లు, ఇతర ఉపద్రవాల్లో చిక్కుకున్నప్పుడు.. తాను ఉన్న ప్రాంతాన్ని అత్యవసర సేవలు అందించే వారికి ఈ డిజిపిన్ ద్వారా సులభంగా తెలపొచ్చు.

ఈ%–%కామర్స్ కంపెనీలు, డిజిటల్ సర్వీ సు ప్రొవైడర్లతో కూడా ఈ డిజిపిన్ వ్యవస్థను అనుసంధానించే కసరత్తు జరుగుతోంది. అప్పుడు క్యాబ్/ఆటో ప్రొవైడ ర్లు, ఆహార పదార్థాల సరఫరా సంస్థలు, కిరాణా, మందుల సరఫరా సంస్థలు కూడా వీటినీ వినియోగించుకోవచ్చు.

## పన్నేతర ఆదాయం పెరగాలి

హైదరాబాద్

రాష్ట్రంలో పన్నేతర ఆదాయం పెంచేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం ఆదివారం ఆయన అధ్యక్షతన సచివాలయంలో జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలు శాఖల ముఖ్య కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. "గత భారాస ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ఒక్కటి కూడా ఆపలేదు. అదనంగా రూ.33,600 కోట్లతో కొత్త సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. బడ్జెట్ నుంచి కొన్ని శాఖలకు అధికంగా, కొన్నింటికి అతి తక్కువగా నిధులు అందుతున్నాయి. అన్ని శాఖలకు సమానంగా పంచాలి. అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న మేజర్ ప్రాజెక్టులకు వాస్తవిక ధోరణిలో ప్రాధాన్యాలను గుర్తించి నిధులు ఖర్చు చేయాలి. రాబోయే పది రోజుల్లో ఏ ప్రాజెక్టుకు ఎన్ని నిధులు ఖర్చుపెట్టాలనే హేతుబద్ధీకరణ పూర్తి చేసి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వానికి ఆదాయం తెస్తున్న శాఖలపై ప్రత్యేక దృష్టి సారించాలి. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రభుత్వ ఆలోచనల మేరకు అందరూ పని చేయాలి. అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే సంపూర్ణ ప్రగతి సాధ్యం" అని ఆదేశించారు.

## స్థానిక ఎన్నికల్లో పంచాయతీ సంఘటన్ కీలకం




-మొదటిపేజీ తరువాయి

గాంధీభవన్‌లో రాజీవ్ గాంధీ పంచాయతీ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో మీనాక్షి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పేద, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని చెప్పారు. ఆయా పథకాల లబ్ధిదారులతో మరింత సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు పంచాయతీ సంఘటన్ ప్రతినిధులు బాధ్యతలు స్వీకరించాలన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు, పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించే బాధ్యత పంచాయతీ సంఘటన్ తీసుకోవాలని కోరారు. పంచాయతీ సంఘటన్ జాతీయ అధ్యక్షుడు సునీల్ పన్వర్ మాట్లాడుతూ.. సంఘటన్ పనితీరును పరిశీలించి కార్యవర్గాన్ని పునర్వ్యవస్థీకరించనున్నట్టు ప్రకటించారు. సమావేశంలో ఆ సంఘటన్ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

తెలంగాణభవన్ ముట్టడికి యత్నం..

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై బీఆర్‌ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నేత బోయ నాగేశ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆందోళనకు దిగారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌ను ముట్టడించేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బోయ నాగేశ్ మాట్లాడుతూ.. బ్లాక్‌మెయిలర్ కౌశిక్‌రెడ్డితో పాటు కేటీఆర్, హరీశ్‌రావు.. సీఎం రేవంత్, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మండిపడ్డారు. మరోసారి బీఆర్‌ఎస్ నేతలెవరైనా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులపై ఇష్టారీతిన మాట్లాడితే తెలంగాణభవన్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. అనంతరం నిరసనకారులను పోలీసులు పీఎసకు తరలించారు. ఈ క్రమంలోనే.. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదు చేయాలంటూ బంజారాహిల్స్ పోలీసులకు కాంగ్రెస్ నేతలు వినతి పత్రం అందజేశారు.

## ఆ విమానాలు నిలిపివేయడమే మంచిది

హైదరాబాద్

ఎయిర్ ఇండియా బోయింగ్ 787%–%8 రకం విమానాల్లో సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వాటి సర్వీసులను నిలిపివేయడమే మంచిదని విమాన ప్రయాణాలు సాగించేవారిలో 56 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఎయిర్ ఇండియా బోయింగ్ 787%–%8 రకం విమానం ఈ నెల 12న అహ్మదాబాద్‌లో కూలిపోవటంతో 270 దుర్మరణం చెందారు. ఈ ఘటన తర్వాత విమాన ప్రయాణికులు తమ ప్రయాణానికి సంబంధించి ఏయే అంశాలపై ఎలాంటి ఆలోచనలు కలిగి ఉన్నారన్నది తెలుసుకునేందుకు లోకల్ సర్కిల్స్ సంస్థ దేశవ్యాప్తంగా 40 వేల మంది నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఆ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో ప్రధానంగా తాము ప్రయాణించబోయేది ఏ రకం విమానం అన్నదానికి ప్రయాణికులు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిసింది. 41 శాతం మంది తాము ఏ రకమైన విమానంలో ప్రయాణించబోతున్నాము.. అది ఏ కంపెనీది అన్నది కూడా చూస్తున్నారు. సర్వేలోని కొన్ని ప్రశ్నలకు వచ్చిన సమాధానాలు..

## 'రేషన్'కు 76,842 మంది అనర్హులు




-మొదటిపేజీ తరువాయి

రోజుల్లోనే వారిని రేషన్ లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిసింది. ఇకనుంచి వారికి రేషన్ కోటా నిలిపివేయనున్నట్లు పౌర సరఫరాలశాఖ వర్గాలు తెలిపాయి. రేషన్ లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం ఇస్తున్నప్పటికీ చాలామంది తీసుకోవడం లేదు. ఇలా కనీసం గత 6 నెలలుగా రేషన్ తీసుకోనివారిని అనుమానాస్పద రేషన్ లబ్ధిదారులుగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వారి వివరాల్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. పౌర సరఫరాలశాఖ ఈ వివరాల్ని జిల్లా కలెక్టర్లకు పంపించి మండలస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం ద్వారా స్థానికంగా విచారణ జరిపించింది. ఇందులో అర్హులు, అనర్హులను గుర్తించి ఆ వివరాల్ని పౌరసరఫరాలశాఖకు పంపించగా, రేషన్ జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించింది.

**వలసలు, రెండుచోట్ల పేర్లు..**

అనుమానాస్పద లబ్ధిదారుల్లో 60 శాతం మంది అనర్హులుగా తేలారు. ఇందులో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, చనిపోయినవారు, రెండుచోట్ల రేషన్ కార్డుల్లో పేర్లున్నవారు ఉన్నట్లు గుర్తించారు. క్షేత్రస్థాయి వివరాల ఆధారంగా పంపిన నివేదికలతో వారిపేర్లను తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. అనర్హులుగా తేలినవారు హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మేడ్చల్ జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు.

# ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్

-మొదటిపేజీ తరువాయి

అమెరికా బీ%-%2ఏ స్పిరిట్ స్టెల్త్ బాంబర్ విమానాలు జారవిడిచాయి. ఈ బాంబులు 200 అడుగుల లోతుకు చొచ్చుకెళ్లి అక్కడి భూగర్భాన్ని బద్దలుకొట్టాయి. నతాంజ్ అణుకేంద్రంపైనా అమెరికా ఇవే బాంబులను వేసింది. మొత్తంగా 14 జీబీయూ బాంబులను ఉపయోగించినట్లు అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్, జనరల్ డేనియల్ కెయిన్ వెల్లడించారు.

**ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్..**

శనివారం అర్ధరాత్రిదాటగానే 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'పేరిట ఈ దాడులను చేసింది. అమెరికాలోని మిస్సోరీలోని వైట్‌హ్యాన్ వైమానిక స్థావరం నుంచి ఆరు బీ%-%2ఏ విమానాల దండు దండయాత్ర మొదలైంది. ఏకధాటిగా 37 గంటలపాటు ప్రయాణించి, మార్గమధ్యంలో గాల్లోనే ఇంధనాన్ని నింపుకుంటూ 11,400 కిలోమీటర్లు ప్రయాణించిమరీ ఫోర్డో, నతాంజ్ అణుకేంద్రాలపై ఒక్కోటి దాదాపు 14,000 కేజీల బరువుండే 14 బంకర్ బస్టర్ బాంబులను పడేశాయి. ఆ తర్వాత ఇస్ఫహాన్ అణుకేంద్రంపై అమెరికా జలాంతర్గామి 30 టోమాహాక్ క్రూజ్ క్షిపణులను ప్రయోగించింది. ఈ మూడు అణుకేంద్రాలపై 75 దాకా గైడెడ్ క్షిపణులను ప్రయోగించి విధ్వంసం సృష్టించింది. మొత్తంగా 125 విమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. కొన్ని విమానాలు దాడిచేయగా మిగతావి శత్రుసేనలను తికమక పెట్టేందుకు వేర్వేరు దిశల్లో చక్కర్లు కొట్టాయి. మెరుపువేగంతో దాడులుచేసి తిరిగి తమతమ స్థావరాలకు చేరుకున్నాయి. యుద్ధ, రవాణా, ఇంధన విమానాలు ఈ 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'లో పాల్గొన్నాయి. అమెరికా దాడుల్లో అణుకేంద్రాల్లో మౌలికవసతులు ఏ స్థాయిలో నాశనమయ్యాయో ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. అయితే పర్వతం పైభాగంలో ఆరు భారీ రంధ్రాలు పడ్డట్లు తాజాగా తీసిన 'ప్లానెట్ ల్యాబ్స్ పీబీసీ'ఉపగ్రహ ఫొటోల్లో కనిపించింది. అయితే అణుబాంబు తయారీని అడ్డుకునేందుకు బాంబులేశామని, ఇరాన్‌లో యుద్ధాన్ని ఎగదోసి, ప్రస్తుత ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశ్యం తమకు లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టంచేశారు. అయితే అణుబాంబు తయారీ సామర్థ్యాన్ని ఇరాన్ సంతరించుకోవద్దనే లక్ష్యంతోనే తాము యుద్ధంలో పాల్గొన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సైనికచర్యను సమర్థించుకున్నారు. తమపై ప్రతిదాడి చేస్తే మిగతా లక్ష్యాలపై దాడులు తప్పవని ఇరాన్‌ను హెచ్చరించారు. అయితే దాడుల తర్వాత ఆయా అణుకేంద్రాల నుంచి ఎలాంటి అణుధార్మికత వెల్లడైన ఛాయలు కనిపించలేదని అంతర్జాతీయ అణుఇంధన ఏజెన్సీ స్పష్టంచేసింది. దాడికి ముందే అక్కడి నుంచి యురేనియం నిల్వలను తరలించినట్లు ఇరాన్ అధికారులు వెల్లడించారు.

**ఊహించనిస్థాయిలో దెబ్బకొడతాం: అబ్బాస్**

ఓవైపు అణు మధ్యవర్తిత్వం కోసం స్వాగతం పలుకుతూ మరోవైపు సమరాగ్నిని రాజేస్తున్న అగ్రరాజ్యాన్ని ఊరికే వదిలిపెట్టబోమని ఇరాన్ ప్రతిజ్ఞచేసింది. చరిత్రలో ఎన్నడూలేని స్థాయిలో దాడులుచేసి బదులు తీర్చుకుంటామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రకటించారు. ఇస్తాంబుల్‌లో జరుగుతున్న ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోపరేషన్ సదస్సులో





పాల్గొనేందుకు వెళ్లిన అబ్బాస్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. "దౌత్యనీతిని కాలరాస్తూ అమెరికా మాపై దాడులకు తెగబడింది. మేం దౌత్యాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టి దేశ రక్షణ కోసం భీకరపోరు చేయాల్సిన తక్షణావసరమిది. దుస్సాహసంతో దారుణంగా దాడులు చేసిన యుద్ధోన్మాద అమెరికా తదుపరి తీవ్ర పర్యావసానాలకు బాధ్యతవహించాల్సి ఉంటుంది. అమెరికా చర్యలకు ఇరాన్ తన సైన్యంతో బదులుతీర్చుకుంటుంది.

దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు ఇరాన్ పాటుపడుతుంది"అని అబ్బాస్ అన్నారు. మరోవైపు తమపై దాడిచేసిన ఇజ్రాయెల్‌పైనా ఇరాన్ ఆదివారం మిస్సైళ్లను ప్రయోగించింది. తన అమ్ములపొదిలోని మధ్యస్థ శ్రేణి ఖుర్రమ్‌షహర్%-%4 క్షిపణిను సైతం ఇరాన్ ప్రయోగించింది. ఇది ఒకేసారి 1,500 కేజీల బరువైన వేర్వేరు వార్‌హెడ్లను ఏకంగా 2,000 కిలోమీటర్లదాకా మోసుకెళ్లగలదు. ఈ క్షిపణిని ఈ యుద్ధంలో వాడటం ఇదే తొలిసారి అని తెలుస్తోంది.

**దాడులను పొగిడిన ఇజ్రాయెల్**

ఇరాన్‌పై అమెరికా దాడి చేయడాన్ని ఇజ్రాయెల్ స్వాగతించింది. ఇదొక అద్భుత, సాహసోపేత, చరిత్రాత్మక ఘటనగా అభివర్ణించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్ మీడియాతో మాట్లాడారు. "దాడులు చేయాలని కోరాం. కానీ అమెరికా నిర్ణయం ముందస్తుగా మాకుతెలీదు. ఇదొక చారిత్రక నిర్ణయం. అమెరికా నేరుగా దాడులు చేస్తున్నందున ఇక మేం దాడులు చేయబోమని అనుకోవద్దు. ఇరాన్ మా భూభాగాలపై క్షిపణులు వేస్తోంది. మేం వాటికి బదులు చెప్పాలి"అని ఇసాక్ అన్నారు. ఆదివారం సైతం ఇరాన్‌లోని డజనుకుపైగా మిలటరీ స్థావరాలపై దాడులుచేశామని చెప్పారు. అయితే ఆస్పత్రులు, మెడికల్ సెంటర్లపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని ఇరాన్ ఆరోపించింది. ఆదివారం నాటికి ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా ఇరాన్‌లో 865 మందిదాకా చనిపోయారని, 3,396 మంది గాయపడ్డారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్'సంస్థ ప్రకటించింది. మరోవైపు ఇరాన్ సుప్రీంనేత అయతొల్లా అలీ ఖమేనీని అత్యంత సురక్షిత బంకర్‌కు తరలించినట్లు తెలుస్తోంది. తమ దేశంలో 24 మంది చనిపోయారని, వేయి మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ పాత లెక్కలనే చెబుతోంది

**మద్దతు కూడగట్టే పనిలో ఇరాన్**

ఇరాన్‌పై దాడులను చైనా, రష్యా తీవ్రంగా ఖండించాయి. దాడుల తర్వాత ఇరాన్‌కు ప్రపంచదేశాల నుంచి సైనిక సాయం పెరుగుతుందని రష్యా వ్యాఖ్యానించింది. ఈ మేరకు రష్యా మాజీ అధ్యక్షుడు, దేశ భద్రతామండలి అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదెవ్ 'ఎక్స్' లో ఒక పోస్ట్ పెట్టారు. "దాడుల కారణంగా ఆ అణుకేంద్రాలు పెద్దగా దెబ్బతినలేదు. పైగా ఇరాన్‌కు బయటి మద్దతు పెరుగుతోంది. అణువార్‌హెడ్‌లు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి"అని అన్నారు. మరోవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మంతనాలు జరిపేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ ఆదివారం మాస్కోకు వెళ్లారు. భేటీ వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

**జలసంధి దిగ్బంధం!!**

ప్రపంచ చమురు జీవనాడికి పేరొందిన హొర్ముజ్ జలసంధిని మూసేస్తామని ఇరాన్ బెదిరించింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయానికి ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలపింది. అయితే జాతీయ ప్రయోజనాలపై కీలక నిర్ణయాలు తీసుకునే 'సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్'ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అది కూడా ఆమోదిస్తే జలసంధి ద్వారా ముడి చమురు, సహజవాయువు రవాణా నౌకల రాకపోకలు స్తంభించిపోనున్నాయి. దాంతో ఇంధన కొరత ఎక్కువై, గిరాకీ పెరిగి, పెట్రో ధరలు మరింత అధికంకానున్నాయి. భారత్‌పై దీని ప్రభావం తీవ్రంగా ఉండే ప్రమాదముంది. మరోవైపు, అమెరికా జోక్యం, బాంబు దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తతలు నెలకొనడంతో ఆదివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్‌తో భారత ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఉద్రిక్తతలపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. చర్చలు, దౌత్యం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ వివరాలను మోదీ తన 'ఎక్స్'ఖాతాలో వెల్లడించారు.

## ఇజ్రాయెల్,అమెరికా విరుచుకు పడుతున్న వేళ..

# ఇరాన్‌కు ప్రధాని మోదీ ఫోన్ కాల్!

**ఢిల్లీ:** ఇరాన్‌పై ఇజ్రాయెల్,అమెరికా దాడులకు తెగబడుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరు దేశాలు శాంతి నెలకొల్పేలా చర్చలు జరపాలంటూ భారత ప్రధాని మోదీ ఇరాన్ అధ్యక్షుడితో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈమేరకు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో 'ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో నేను మాట్లాడాను. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడుల గురించి చర్చించాం. ఈ దాడులపై ఆందోళన వ్యక్తం చేశాం. ప్రాంతీయంగా శాంతి, భద్రత, స్థిరత్వాన్ని త్వరగా పునరుద్ధరించడానికి, తక్షణ ఉద్రిక్తతలను తగ్గించడం, శాంతి చర్చలు జరపాలని చెప్పినట్లు ' పేర్కొన్నారు. సుదీర్ఘకాలం నుంచి ఇరాన్‌తో పాటు ఇరాన్ మద్దతిస్తున్న హమాస్, హెజ్‌బొల్లా వంటి మిలిటెంట్లు గ్రూపులు ఇజ్రాయెల్‌పై దాడులకు తెగబడుతున్నాయి. ఈ దాడులు తన భద్రతకు ముప్పుగా భావిస్తోంది. అందుకే ఇజ్రాయెల్ హమాస్, హెజ్‌బొల్లాతో పాటు ఇరాన్‌పై దాడుల్ని తీవ్రతరం చేసింది.

**ఇరాన్‌పై అమెరికా ఎందుకు దాడులు చేస్తోంది?**

ఈ ఇరు దేశాల యుద్ధంలో ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో అమెరికా సైన్యం శనివారం (జూన్ 21, 2025న) ఇరాన్‌లోని మూడు ప్రధాన అణు కేంద్రాలపై వైమానిక దాడులు చేసింది. ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ అనే అణు కేంద్రాలపై %దీ%-2 స్పిరిట్ బాంబర్లతో భారీ బాంబుల వర్షం కురిపించింది. ట్రంప్ సైతం ఈ దాడి విజయవంతమైందని పేర్కొన్నారు. ఈ దాడి ద్వారా అమెరికా అధికారికంగా యుద్ధంలోకి దిగినట్టయింది. ఇరాన్ అణు ఆయుధాలు తయారు చేయకుండా అడ్డుకోవడమే ప్రధాన ఉద్దేశమని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ చర్యపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇది యుద్ధాన్ని మరింత పెంచుతుందా లేక శాంతికి దారి తీస్తుందా అన్నది



ప్రశ్నార్థకంగా మారింది. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి నాంది కావొచ్చని పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధానికి కారణం**

ఇరాన్ ప్రధానంగా హమాస్ (పాలస్తీనా), హెజ్బొల్లా (లెబనాన్) వంటి మిలిటెంట్ గ్రూపులకు ఆర్థిక సహాయం, ఆయుధాలు, శిక్షణ అందిస్తోంది. ఈ శిక్షణను ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)లోని ఖుద్స్ ఫోర్స్ అనే విభాగం నిర్వహిస్తోంది. హమాస్: ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7,2023న జరిగిన దాడికి ముందు, హమాస్ మిలిటెంట్లు ఇరాన్‌లో శిక్షణ పొందినట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. వీరికి డబ్బు,ఆయుధాలు,సాంకేతిక సహాయం కూడా అందించినట్లు ఆరోపించింది.

హెజ్ బొల్లా: ఇది లెబనాన్‌లో ఉన్న షియా మిలిటెంట్ గ్రూప్. దీనికి ఇరాన్ మద్దతు ఇస్తుంది. హెజ్ బొల్లాకు ఆయుధాలు, శిక్షణతో పాటు వ్యూహాత్మక సలహాలు సూచనలు ఇస్తోంది. అందకు హెజ్‌బొల్లా, హమాస్‌తో పాటు ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్ని తీవ్రతరం చేసింది. హెజ్‌బొల్లా,హమాస్ గ్రూపుల్ని నిర్వీర్యం చేసింది. ఆ రెండు గ్రూపులకు కీలకంగా వ్యవహరిస్తున్న టాప్ కమాండర్లను హతమార్చింది. ఇప్పుడు ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది.

## నక్సల్స్‌ను వర్షాకాలంలోనూ నిద్రపోనీయం

రాయపూర్

వర్షాకాలం సీజన్‌లోనూ నక్సల్స్‌ను విశ్రాంతి తీసుకోనీయమని, నక్సల్స్ ఏరివేత ఆపరేషన్ ఆ సీజన్‌లోనూ కొనసాగుతుందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా హెచ్చరించారు. నక్సల్స్‌తో చర్చల ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్ అటల్ నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్శిటీ సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు అమిత్‌షా ఆదివారంనాడు శంకుస్థాపన చేశారు. గత ఏడాది జనవరి నుంచి రాష్ట్రంలోని వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 400 మంది నక్సల్స్‌ను భద్రతా బలగాలు మట్టుబెట్టాయని అమిత్‌షా ఈ సందర్భంగా చెప్పారు. ప్రతిసారి రుతుపవనాల సీజన్‌లో సహజంగా నక్సల్స్ రెస్ట్ తీసుకుంటూ ఉంటారని, కానీ ఈసారి ఆ సీజన్‌లోనూ వారిని నిద్ర పోనీయమని, 31/3 (2026 నాటికి నక్సల్స్ నిర్మూలన) లక్ష్యం సాధించే దిశగా మరింత ముందుకు దూసుకు వెళ్తామని చెప్పారు. నక్సల్స్ లొంగిపోవాలని, లొంగుబాటు పాలసీని అందిపుచ్చుకుని ప్రయోజనాలు పొందాలని పిలుపునిచ్చారు.

**చర్చలు అవసరం లేదు**

'చర్యల అవసరం లేదు. కేవలం ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవడమే. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని వారిని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్రం ప్రకటించిన హామీలన్నీ ఖచ్చితంగా అమలయ్యేలా చూస్తాం. అంతకంటే ఎక్కువగా కూడా వారికి సాయం చేసేందుకు ప్రయత్నిస్తాం' అని అమిత్‌షా నక్సల్‌కు సూచించారు.

## హర్మూజ్ జలసంధి మూసేస్తే..
## కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ఏమన్నారంటే?




ఢిల్లీ

ఇరాన్‌లోని అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికా దాడులతో అక్కడి పరిస్థితి క్షీణించింది. దీంతో ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హర్మూజ్ జలసంధిని మూసివేసేలా ఇరాన్ పార్లమెంటు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఈ అంశంపై ఆ దేశ భద్రతా మండలి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పలు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని ఒకవేళ ఇరాన్ మూసివేస్తే భారత్‌పై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "గత రెండు వారాలుగా మధ్యప్రాచ్యంలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులను మేం నిశితంగా గమనిస్తున్నాం. ప్రధాని మోదీ నాయకత్వంలో మనం గత కొన్నేళ్లుగా మన సరఫరాలను వేర్వేరు మార్గాలకు వికేంద్రీకరించాం. మన సరఫరాలలో ఎక్కువ భాగం ఇప్పుడు హర్మూజ్ జలసంధి ద్వారా రావడం లేదు. మన చమురు మార్కెటింగ్ కంపెనీలకు అనేక వారాల పాటు సరఫరాలు ఉండటంతో పాటు వివిధ మార్గాల నుంచి ఇంధన సరఫరాలు అందుతూనే ఉన్నాయి. మన పౌరులకు ఇంధన సరఫరాలో స్థిరత్వాన్ని సాధించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని పేర్కొన్నారు.

ఒమన్-ఇరాన్ మధ్య ఇరుకుగా ఉండే సముద్ర మార్గమే హర్మూజ్ జల సంధి. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి వివిధ దేశాలకు ఈ మార్గంలోనే రోజుకు దాదాపు 2.1 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు ఎగుమతి అవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ వినియోగంలో ఇది 21 శాతానికి సమానం. ప్రపంచ దేశాలు వినియోగించే ఎల్‌ఎన్‌జీ(ద్రవరూప సహజ వాయువు)లోనూ 20% ఇక్కడ నుంచే సరఫరా జరుగుతోంది. ఈ నౌకలన్నీ హర్మూజ్ జలసంధి నుంచే రాకపోకలు సాగించాలి. భారత్ అవసరాల్లో 85% ముడి చమురు సౌదీ, ఇరాక్, యూఏఈ నుంచి రవాణా అవుతోంది. ఖతార్ నుంచి ఎల్‌ఎన్‌జీ కూడా ఈ మార్గంలోనే వస్తుంది. తాజా పరిణామాల నేపథ్యంలో హర్మూజ్ జల సంధిని ఇరాన్ ఒకవేళ మూసేస్తే భారత్‌లో ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందనే అంచనాల నేపథ్యంలో కేంద్రమంత్రి పైవిధంగా స్పందించారు.

## కలిసి పనిచేస్తేనే లాభం!

న్యూఢిల్లీ

పొరుగు దేశాలతో సంబంధాలు ఎల్లప్పుడూ సజావుగా సాగాలని ఆశించకూడదని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. పాలకులతో సంబంధం లేకుండా సంబంధాల్లో స్థిరత్వాన్ని నిర్మించడానికి తమ ప్రభుత్వం ప్రయత్నించిందని నొక్కి చెప్పారు. అందుకు శ్రీలంక, మాల్దీవులను ఆయన ఉదహరించారు. అక్కడ నాయకత్వం మారినప్పటికీ ద్వైపాక్షిక సంబంధాలు స్థిరంగా ఉన్నాయన్నారు. ఏ దేశంతోనైనా పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పుడు చేతులెత్తేయకూడదన్నారు. భారత్‌తో కలిసి పనిచేయడం ఇతర దేశాలకే లాభిస్తుందని, లేదంటే వారే నష్టపోతారని వ్యాఖ్యానించారు. అయితే ఈ విషయాన్ని గ్రహించడానికి కొన్ని దేశాలకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. సైన్యం చేతుల్లో అధికారం, భారత్‌పై శత్రుత్వంతో ఉన్న పాకిస్తాన్ ఇందుకు మినహాయింపని, ఒక్క పాక్‌ను పక్కనపెడితే.. దౌత్యం అన్ని చోట్లా వర్తిస్తుందన్నారు. డీడీ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ లింక్‌ను తన ఎక్స్ హ్యాండిల్‌లో శనివారం రాత్రి ఆయన పోస్టు చేశారు. దాదాపు గంటసేపు జరిగిన సంభాషణలో దౌత్యసంబంధాలపై అనేక విషయాలను జైశంకర్ పంచుకున్నారు. చైనాతో చాలా సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని, వాటిని ఎదుర్కోవడానికి మన సామర్థ్యాలను పెంచుకోవాల్సి వచ్చిందని తెలిపారు. జూన్ 2020లో గాల్వన్ లోయ ఘర్షణ తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. అయితే.. గత దశాబ్దాల్లో మన సరిహద్దు మౌలిక సదుపాయాలను పూర్తిగా విస్మరించడం వల్లే ఈ గందరగోళ పరిస్థితి వచ్చిందన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం సరిహద్దు మౌలిక సదుపాయాలపై నిర్మించడం వల్ల పరిస్థితి మారిపోయిందని, మన దేశ ప్రయోజనాలను కాపాడుకోగలుగుతున్నామని జైశంకర్ తెలిపారు. గత 11 ఏళ్లలో భారత్ పొరుగు దేశాలతో సంబంధాలను మరింతగా పెంచుకుందని, గల్ఫ్ దేశాలకు చేరువైందని, ఆసియాన్, ఇండో-పసిఫిక్ ప్రాంతాలతో సంబంధాలను మరింతగా బలోపేతం చేసుకుందని చెప్పారు.

మోదీ ప్రభుత్వం హయాంలో పాకిస్తాన్ పట్ల భారతదేశ విధానం మారిపోయిందని, 2016 ఉరి సర్జికల్ స్ట్రైక్, 2019 బాలకోట్ వైమానిక దాడులను ఆయన ప్రస్తావించారు. ఆర్టికల్ 370 రద్దు, భారత్ ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలను విస్తృత వ్యూహంలో భాగాలుగా చూడాలని జైశంకర్ చెప్పారు. ప్రధాని మోదీని 'మన కాలపు నాయకుడు'గా జైశంకర్ అభివర్ణించారు. ప్రజల మానసిక స్థితి మారిందని, ప్రజల ఆత్మవిశ్వాసానికి'ప్రధాని మోదీ నిదర్శనమని మంత్రి నొక్కి చెప్పారు.

# మాటల మాంత్రికుడు పాత్రో



తెలుగు చిత్ర సీమ లో చెరగని సంతకం గణేష్ పాత్రో. సిని మాలను బట్టి, పాత్రలకు సమయోచితంగా, సందర్భాను సారంగా మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి. దర్శకుడి ఆలోచనలను అర్థం చేసుకుని, అందుకు అను గుణంగా సంభాషణలు రాయడం అన్నది మామూలు విషయం కాదు. అంత సులువు కానే కాదు. దర్శకుని మనోభావాలు ప్రతిబింబించేలా రచయిత సంభాషణలు రాస్తేనే సదరు సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూర గొంటున్న దన్న మాట యదార్థం. కొందరు దర్శకులకు, కొందరు రచయితలతో కలిసి పనిచేయడం చాలా అనుకూలంగా ఉంటుంది. బహుశా, ఈ కారణంగానే చాలామంది రచయితలకు ఎక్కువ మంది దర్శకులతో పనిచేసే అవకాశం దొరకదు. కానీ, గణేష్ పాత్రోకు తన సినీ రంగ కలిసి చేసిన ప్రయాణంలో దర్శకులందరూ వైవిధ్యాన్ని కోరుకునే వారే. వెండితెర మీద తమదైన ముద్ర వేదుకున్న వారే. బాల చందర్ తో పాటు, సింగీతం శ్రీనివాసరావు, క్రాంతికుమార్ వంశీ, కోడి రామకృష్ణ, ఇంకా నేటితరం దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఎవరి శైలి వాళ్ళది. తెలుగు వెండితెరపై ఎవరి ప్రత్యేకత వారిది. వారు కోరుకున్న విధంగా, వారి అభిరుచులకు అనుగుణంగా సంభాషణలు రాసి మెప్పించిన ఘనత మాత్రం గణేష్ పాత్రోదే. గణేష్ పాత్రో కథలు, నాటికలు సమకాలీన పరిస్థితులకి, మధ్య తరగతి కుటుంబాలలోని మనుషుల అంతరంగాలు, సంఘర్షణలకు ప్రతి బింబాలుగా నిలుస్తాయి. అందుకే దర్శకులు నిర్మాతలు ఆయన రచనలు ఇష్ట పడ్డారు. ప్రేక్షకులు ఆదరించారు.గణేష్ పాత్రో పేరు చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే మరో పేరు కె. బాలచందర్. పందొమ్మిది వందల డెబ్భై, ఎనభై దశకాల్లో తెలుగు తెరమీద బాలచందర్, పాత్రో కాంబినేషన్ విజయాల పరంపర కొనసాగించు కుంది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ప్రతి చిత్రానికి తెలుగులో గణేష్‌పాత్రోనే సంభాషణలు రాశారు. బాల చందర్ తమిళ ఆలోచనలకు అచ్చ తెలుగు మాటలను అద్దిన రచయిత గణేష్ పాత్రో. అందుకే కాబోలు బాలు, స్వప్న, జానీ, సుహాసిని, బుచ్చిబాబు, విద్య, బేబీ.. ఈ పాత్రలేవీ కూడా పరభాషా దర్శకుడు సృష్టించినవన్న భావన కలగదు. సినిమాకు స్థానికత అద్దడంలో సంభాషణలది కీలక పాత్ర. బాలచందర్ దర్శకత్వం వహించిన మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, రుద్ర వీణ, ఇది కథకాదు లాంటి పలు చిత్రాలు గణేష్ పాత్రోకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దర్శకుడు కే.బాల చందర్‌తో గణేష్‌పాత్రో అనుబంధం విడదీయ రానిది. అందుకేనేమో బాలచందర్ మరణించిన రెండు వారాలకు గణేష్ పాత్రో ఆయనను అనుసరించి వెళ్లడం గమనార్హం. సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ, గణేష్ పాత్రోల కలయికలో 40 చిత్రాలు తెరకెక్కడం విశేషం. ముఖ్యంగా భార్గవ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత దివంగత ఎస్ గోపాల్ రెడ్డికి ఆస్థాన రచయితగా గణేష్ పాత్రో వ్యవహరించారు. అలాగే, ప్రముఖ దర్శకుడు క్రాంతి కుమార్‌తో కలసి పలు చిత్రాలకు పనిచేశారు. గణేష్‌పాత్రో స్వాతి చిత్రానికి 1983లో, రుద్రవీణ చిత్రానికి గాను 1988లో ఉత్తమ నంది అవార్డులను అందుకున్నారు. మయూరి చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నంది అవార్డును దక్కించు కున్నారు. 2009లో ఆయన అభిమానంగా ప్రేమించే అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాన్ని, 2013లో మనసు కవి ఆత్రేయ బిరుదును అందుకున్నారు. గణేష్ పాత్రో విజయ నగరం జిల్లా పార్వతీ పురంలో 1945 జూన్ 22న ఆది లక్ష్మీనారాయణ పాత్రో, సూర్యకాంతం దంపతులకు జన్మించారు. గణేష్ పాత్రో తండ్రి, పార్వతీపురం దగ్గర ఒక చిన్న గ్రామానికి కరణంగా పనిచేసేవారు. గణేష్ ప్రాథమిక విద్య అక్కడే సాగింది. పార్వతీ పురంలో ఉన్నత చదువులు చదువుతూ, నాటకాలలో నటించడం ప్రారంభిం చారు. పాఠశాల పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా చదవటం ప్రారంభించారు. పీ.యూ.సి పూర్తయిన తర్వాత పై చదువులకు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరారు. అక్కడ విశ్వ విద్యాలయ సాంస్కృతిక సంఘానికి జాయింట్ సెక్రటరీగా నాటకాలు వ్రాయటం, వాటిని రంగస్థలంపై ప్రదర్శించడం ప్రారంభించారు. చిన్నప్పటి నుంచే నాటకాలు రాయడం, నటనపై గణేశ్ పాత్రో ఆసక్తి పెంచుకున్నారు. 'పావలా', 'కొడుకు పుట్టాల', 'ఆలోచించండి' వంటి పలు నాటకాలతో రచయితగా ప్రాచుర్యం పొందారు. ఇందులో 'కొడుకు పుట్టాల' నాటకానికి అంతర్జాతీయ పురస్కారం లభిం చింది. ఈ నాటకం పలు భాషల్లో అనువాదం కావడంతో పాటు ఆకాశవాణి, దూరదర్శన్ లలో ప్రసారమై, పాత్రో కు గుర్తింపు తెచ్చాయి. 1970 ప్రాంతంలో రచన ప్రారంభించిన గణేష్ పాత్రో అయిదేళ్ళ కాలంలో ప్రథమ శ్రేణి నాటక కర్తగా పేరు తెచ్చుకున్నారు. రచనలు చాలా తక్కువే అయినా, వ్రాసిన ప్రతి నాటిక, నాటకము రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పు పొందింది. కథా వస్తువును పరి గ్రహించడంలో, కథనంలో, పాత్ర చిత్రణలో, సన్నివేశాల మేళవింపులో, మాటల కూర్పులో నిత్య నూతన పరిమళాన్ని వెదజల్లిన ప్రతిభాశాలి గణేష్ పాత్రో. సంఘటనల ద్వారా సమస్యను శక్తివంతంగా ఆవిష్కరించటం అయన రచనా విధానంలో ప్రత్యేకత. మృత్యుం జయుడు, తెరచి రాజు, తరంగాలు, అసుర సంధ్య నాటకాలూ, కొడుకు పుట్టాల, పావలా, లాభం, త్రివేణి, ఆగండి! కొంచెం ఆలోచించండి మొదలైన నాటికలు తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్న ఉత్తమ రచనలు. 1970 నుండి 1990ల వరకు అనేక సినిమాలకు సంభాషణలు, కథను సమ కూర్చారు.125కు పైగా చిత్రాలకు కథలు, మాటలను అందించారు. పదిహేనేళ్ళ విరామానంతరం సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాకు సంభాషణలు సమకూర్చారు. "హలో గురూ ప్రేమ కోసమేరా ఈ జీవితం"... నిర్ణయం సినిమాలో పాట రాశారు. అదే ఆయన సంభాషణలు రాసిన చివరి చిత్రం. ఆయన సినీ సంభాషణలు సమకూర్చిన చిత్రాల్లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, నిర్ణయం, సీతారామయ్య గారి మనవరాలు, రుద్రవీణ, తలంబ్రాలు, ప్రేమించు పెళ్ళాడు, మయూరి, మనిషికో చరిత్ర, గుప్పెడు మనసు, ఇది కథ కాదు, మాపల్లెలో గోపాలుడు ఇలా పలు హిట్ చిత్రాలు ఉన్నాయి.

# ఎరువుల వాడకంతో ఆరుద్రపురుగు కనుమరుగు



దేవతలకు, వరుణ దేవుడికి ప్రతిరూపంగా, తమకు శుభ సూచకంగా రైతులు భావించే, ఆరుద్ర పురుగులు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి.. ఆరుద్ర నక్షత్రములలో ఆరవది. రాశి చక్రములలో, "ఆరుద్ర" నక్షత్రం యొక్క నాలుగు పాదములు, "మిధున (జెమిని) రాశికి చెందుతాయి. వ్యవసాయ పనులు ప్రారంభించ దానికి, "ఆరుద్ర కార్తె" అనుకూలమైనది. ఈ కార్తెలో మాత్రమే కనబడేది ఆరుద్ర పురుగు. ఇది మొఖమల్ బట్టను చుట్టుకున్నట్లుగా ఉండి, ఎర్రగా బుర్రగా, బొద్దుగా ఉంటుంది. అందంగా ఉండే ఈ పురుగు పంటలకు ఎలాంటి హానీ చేయదు. ఏడాదికి ఒకసారి మాత్రమే ప్రత్యక్షమౌతుంది. "ఇట్టే వచ్చి, అట్టే మాయమౌతావు, ఆరుద్ర పురుగుకు మల్లే." అని తెలుగు నాట, ఒక జాతీయము మిగుల ప్రాచుర్యములో ఉంది. ఆరుద్ర పురుగును కొన్ని చోట్ల "పట్టు పురుగు" అనీ, "చందమామ పురుగు " అనీ, "లేడీ బర్డ్" అనీ, "ఇంద్రగోప పురుగు" అని కూడా అంటారు. ఇలా చాలా పేర్లను కలిగి ఉన్న ఈ పురుగు చూడటానికి అరంగుళం సైజులో ఉండి, ఎర్రని మఖ్మల్ బట్టతో చేసిన బొమ్మలాంటి పురుగులా ఉంటుంది. ముట్టుకుంటేనే – అత్తిపత్తి చెట్టు ఆకుల్లా ముడుచుకు పోయే స్వభావం ఉన్న ఈ పురుగులు నేలమీద, కొన్నిచోట్ల ఇసుక నేలల్లో, పచ్చగడ్డి కాసింత ఉన్న చోట్లలో, విరివిగా కనిపిస్తాయి. ఈ అందమైన, మెత్తనైన పురుగులు వర్షాకాలం తొలకరి వర్షాలు కురవగానే, బిల బిల మంటూ కుప్పలు కుప్పలుగా కనిపిస్తాయి. బీడువారిన నేలపై తొలకరి జల్లులు పడగానే, బిలబిలమంటూ ఆరుద్ర పురుగులు నేలపైకి వస్తాయి. అలా ఆరుద్ర పురుగులు నేలపై కనిపిస్తే ఆ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తాయనీ, రైతన్నలు వ్యవసాయం చేసుకోవచ్చని అంటారు. ఆరుద్ర పురుగులకు రైతులకు అవినాభావ సంబంధం ఉంది. వీటిని ఏ రైతు చంపడు, ఎవ్వరినీ చంపనీయడు... వ్యవసాయ పనులు మొదలు పెట్టేందుకు ఆరుద్ర కార్తె అనుకూలమైంది. ఈ కార్తెలో మాత్రమే కనబడే అరుదైన పురుగు ఆరుద్ర. అందుకే దాన్ని "ఆరుద్ర పురుగు " అంటారు. ఇవి ప్రకృతి నేస్తాలు. చూడ ముచ్చటగా ఉండే ఆరుద్ర పురుగు ఆగమనాన్ని రైతులు "శుభసూచకం"గా భావిస్తారు. ఇక వ్యవసాయం పనులు మొదటు పెట్టుకోవచ్చని ఆనందంగా పొలాలకేసి మళ్లుతారు. గ్రామాల్లో ఈ పురుగులు కనిపించాయంటే రైతులు సంతోషంతో గంతులేస్తారు. ఆరుద్ర పురుగుల దర్శనంతో, ఆ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడుతాయని సంకేతం. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుతాయనే ధీమా రైతుల్లో నెలకొంటుంది. ఇసుక నేలల్లో, బొరియలు చేసుకుంటూ, అందులోనే జీవిస్తూ, తొలకరి వర్షాలకి బయటకి వస్తాయి. ఇవి నేలలోని సూక్ష్మ క్రిముల్ని పట్టి తింటూ, రైతులకి మేలు చేస్తాయి. ఇవి అలా బయటకి వచ్చినప్పుడు వర్షానికి. తడిసిన నల్లని భూమి మీద, ఆకుపచ్చని గీతల్లాంటి గడ్డి మీద ఎర్రని చుక్కలు అద్దినట్లుగా కనిపిస్తాయి. ఆ దృశ్యం ఎంతో హృద్యముగా ఉంటుంది. ఇవి మృదువుగా వుండి ముట్టుకుంటే వెల్వెట్ వస్త్రంలా మెత్తగా అనిపిస్తాయి. చూడగానే పట్టుకోవాలని అనిపించెంతగా, ముద్దుగా అందంగా కదిలే బొమ్మల్లా ఉంటాయి. పురుగులంటే భయపడే చిన్న పిల్లలు సైతం ఈ ఆరుద్ర పురుగుల్ని పట్టుకుంటారు. ముట్టుకుంటే చాలు అవి ముడుచు కుంటాయి. కొంత సేపటికి, ఏ కదలికా లేకుండా ఉంటే మెల్లగా నడవడం మొదలు పెడతాయి. అయితే ఆరుద్ర పురుగులు నెమ్మదిగా అంతరించే దశకు చేరుకుంటున్నాయి. పొలాల్లో మితిమీరిన క్రిమిసంహారక మందులు వాడకం దీనికి ముఖ్య కారణం. ఈమధ్య కాలంలో మరో ప్రమాదకరమైన ధోరణి ఛత్తీస్ గడ్ మరియు తెలుగు రాష్ట్రాల్లో చోటు చేసుకుంటున్నది. ఈ పురుగుల్ని కిలోల లెక్కన కొనే ఏజెంట్లు బయలు దేరారు. వీటి నుంచి సేకరించే నూనెను పక్షవాతం రోగులకు వాడే తైలం లోనూ, లైంగిక సామర్థ్యాన్ని పెంచే ఆయుర్వేద మందుల తయారీలోనూ వాడుతున్నారని చెపుతారు. అరబ్ దేశాలలో కూడా ఈ పురుగుల్ని వాడుతారు. మనిషి వెదజల్లుతున్న కాలుష్యం, పురుగుల మందుల వల్ల – ఊరపిచ్చుకల, మరికొన్ని జీవాల వలే, ఇవి కూడా కనిపించకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

# యోగా విరామ బటన్

ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది పాల్గొన్నారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా విచ్చేసి.. యోగాంధ్రలో పాల్గొన్నారు. యోగా కేవలం వ్యక్తిగత సాధన మాత్రమే కాకుండా, ప్రపంచ భాగస్వామ్యానికి మాధ్యమంగా మారాలని, ప్రతి దేశం, సమాజం యోగాను తమ జీవన విధానంలో, ప్రభుత్వ విధానంలో భాగంగా చేసుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, యోగా కేవలం వ్యాయామం కాదని, అదొక జీవన విధానమని అన్నారు. "యోగా అంటే సరళంగా చెప్పాలంటే కలపడం. ఇది ప్రపంచాన్ని కలిపింది" అని ఆయన తెలిపారుయోగా ప్రపంచాన్ని కలిపింది. 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. ఇది మనతోనే సాధ్యమైంది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది జీవనశైలిని యోగా మార్చింది. నేవీకి చెందిన నౌకల్లో యోగాసనాలు వేస్తున్నారు. యోగా అందరి కోసం. ప్రగతి, ప్రకృతి సంగమస్థలి విశాఖ నగరం. చంద్రబాబు, పవన్, లోకేష్‌కు అభినందనలు. వన్ ఎర్త్.. వన్ హెల్త్ థీమ్‌తో ఈ సారి యోగా డే జరుపుకుంటున్నాం. ప్రపంచంతో మనం అనుసంధానం కావడానికి యోగా ఉపయోగపడుతుంది.అందరి క్షేమమే నా కర్తవ్యమని భారతీయ సంస్కృతి నేర్పుతుంది. ప్రపంచం ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటుంది. ఈ పరిస్థితుల్లో యోగా శాంతికి తోడ్పడుతుంది. యోగా మనలో మానవత్వం పెంచుతుంది. వ్యక్తిగత క్రమశిక్షణకు యోగా ఒక అద్భుత సాధనం. నేను నుంచి మనం అనే భావనకు తీసుకెళ్లే ఆయుధం. ఒబేసిటీ అనేది ప్రపంచానికి పెద్ద సమస్య. తీసుకునే ఆహారంలో నూనె పదార్థాలను 10 శాతం తగ్గించాలి. యోగాను ఒక ఉద్యమంలా తీసుకెళ్లాలి. అందరికి యోగాతో ప్రతి రోజు మొదలవ్వాలి." అని ప్రధాని మోదీ అన్నారు. ప్రధాన మంత్రి మోదీ మాట్లాడుతూ, జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి భారతదేశం ఒక తీర్మానాన్ని సమర్పించిన రోజును గుర్తు చేసుకున్నారు. చాలా తక్కువ సమయంలో, ప్రపంచంలోని 175 దేశాలు మన దేశంతో నిలబడ్డాయి. నేటి ప్రపంచంలో ఈ ఐక్యత మరియు మద్దతు సాధారణ సంఘటన కాదు" అని ఆయన అన్నారు. సమకాలీన కాలంలో భౌగోళిక రాజకీయ అశాంతి మరియు ప్రాంతీయ అస్థిరతను ప్రస్తావిస్తూ, మోదీ "యోగా మనకు శాంతి దిశను ఇస్తుంది" అని అన్నారు. "మానవాళికి శ్వాస తీసుకోవడానికి, సమతుల్యం చేయడానికి మరియు తిరిగి సంపూర్ణంగా మారడానికి యోగా ఒక విరామ బటన్" అని ఆయన అన్నారు. యోగాను శతాబ్దాల నుంచి ఋషులు ఆచరిస్తున్నారు. ప్రస్తుతం, ప్రపంచం మొత్తం యోగా ప్రాముఖ్యతను అర్థం చేసుకుంది. దానిని అంగీకరించింది. నేడు, దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు యోగాభ్యాసం ద్వారా తమను తాము ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. యోగా బరువు తగ్గడానికి ఒక మార్గం మాత్రమే కాదు. యోగాభ్యాసం సమయంలో, అనేక రకాల ఆసనాలు, కార్యకలాపాలు చేస్తుంటారు. ఇది ఒక వ్యక్తికి శారీరకంగా, మానసికంగా ప్రయోజనం చేకూరుస్తుంది.క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీర నొప్పి, శరీర భంగిమ, అనేక ఆరోగ్య సమస్యలు మెరుగుపడతాయి. బహుశా అందుకే నేటి కాలంలో, పిల్లల నుంచి వృద్ధుల వరకు, ప్రతి ఒక్కరూ తమ ఫిట్‌నెస్ దినచర్యలో యోగాను చేర్చుకోవడానికి ఇష్టపడతారు. కానీ మీరు యోగా నుంచి నిజంగా ప్రయోజనాలను పొందుతున్నారో లేదో తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యం. కాబట్టి ఈ వ్యాసంలో ఇప్పుడు మనం యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం.మీరు యోగాను క్రమం తప్పకుండా, సరిగ్గా సాధన చేసినప్పుడు, అది మీ శరీరం వశ్యతను మెరుగుపరుస్తుంది. మీ కీళ్ళు, కండరాలలో కదలిక పరిధి పెరుగుదలను మీరు గమనించవచ్చు. మీ కాలి వేళ్లను తాకడం, వెనుకకు వంగడం లేదా గతంలో కష్టంగా అనిపించిన భంగిమలను చేయడం మీకు సులభం అనిపించవచ్చుమీరు క్రమం తప్పకుండా యోగా సాధన చేసినప్పుడు, అది మీ శరీర భంగిమను కూడా మెరుగుపరుస్తుంది. ఇప్పుడు మీరు మీ భంగిమ గురించి ఎక్కువ ఆలోచించాల్సిన అవసరం లేదు. కానీ మీరు నిలబడటం లేదా నిటారుగా కూర్చోవడం అవసరం. మీ వెన్నెముక అమరిక మెరుగుపడుతుంది. మీరు వంగడం వంటి సమస్య నుంచి కూడా దూరం అవుతారు. అంతే కాదు, శరీర భంగిమ సరిగా లేకపోవడం వల్ల కలిగే మెడ నొప్పి, వెన్నునొప్పి వంటి సమస్యలను కూడా దూరం చేస్తుంది. యోగా సాధన ప్రారంభించినప్పుడు, కొన్ని రోజుల్లోనే మీలో మార్పును మీరు అనుభూతి చెందడం ప్రారంభిస్తారు. యోగా ఆరోగ్యానికి మేలు చేసినప్పుడు, కొన్ని సానుకూల మార్పులు కనిపించడం ప్రారంభిస్తాయి. ఉదాహరణకు, ఇది శరీర శక్తి స్థాయిని పెంచుతుంది. మీరు రోజంతా మరింత చురుకుగా ఉంటారు. మీరు త్వరగా అలసిపోయినట్లు లేదా బలహీనంగా అనిపించదు. యోగాభ్యాసం ప్రారంభించినప్పుడు, అది మీ జీర్ణవ్యవస్థపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. మీ జీర్ణ అవయవాలకు మంచి మసాజ్ ఇచ్చే అనేక యోగాసనాలు ఉన్నాయి. ఇది రక్త ప్రసరణ, ఆక్సిజన్‌ను కూడా మెరుగుపరుస్తుంది. అటువంటి పరిస్థితిలో, ఒక వ్యక్తి మలబద్ధకం వంటి జీర్ణ సంబంధిత సమస్యలను తక్కువగా ఎదుర్కోవలసి ఉంటుంది. మీ ప్రేగు కదలిక మునుపటి కంటే మెరుగ్గా ప్రారంభమైతే, మీరు యోగాభ్యాసం నుంచి ప్రయోజనాలను పొందుతున్నారని అర్థం.

# ఆరోగ్య భద్రతకు ఓపెన్ జిమ్స్





**మన్సూరాబాద్, ప్రభాత సూర్య :** ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం, ఫిట్నెస్ పట్ల అవగాహన పెంచడం లక్ష్యంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేస్తున్నామని జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి తెలిపారు. శ్రీరామ హిల్స్ కాలనీలో 8.15 లక్షల రూపాయల నిధులతో నూతనంగా ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం శివ హిల్స్ కాలనీలో 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ఓపెన్ జిమ్ ను, అలాగే 2.50 లక్షల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన పవర్ బోర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే అసలైన సంపద. సాంకేతిక యుగంలో మనం దినచర్యల్లో శారీరక శ్రమ తగ్గిస్తున్న తరుణంలో, ఆరోగ్య పరిరక్షణ కోసం ఓపెన్ జిమ్స్ ఎంతో ఉపయోగపడతాయి. అందుకే ప్రభుత్వ నిధులతో ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం. ప్రతి ఒక్కరు వీటిని వినియోగించుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలి అని సూచించారు. స్థానికులు ఈ చర్యను అభినందిస్తూ, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు జైపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, స్వామి గౌడ్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాధవ రెడ్డి, మోహన్ రెడ్డి, సుధాకర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ సర్కార్ గ్రామీణ ప్రాంతా రజకుల అభివృద్ధికై కృషిచేయాలి





**ఇండ్లు లేని వృత్తిదారులకు డబుల్ బెడ్రూంలు ఇవ్వాలి : రవీందర్**

**గతంలో కేటాయించిన 450 కోట్లు రిలీజ్ చేయాలి : అశోక్**

**కోడంగల్, ( ప్రభాత సూర్య)** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 సం.లు కావస్తున్నా ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్టు రజకుల బతుకులు ఉన్నాయని గోపి రజక అన్నారు. వికారాబాద్ జిల్లా కోడంగల్ మండలం అన్నారం గ్రామంలో ఆదివారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవీందర్, వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక , అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సాయిలు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 45 సం.లు నిండిన రజక వృత్తిదారులకు పెంఛన్ సదుపాయం, అకాల మరణం చెందిన ఇంటి యజమాని కుటుంబానికి 10 లక్షల జీవిత బీమా, హెల్త్ కార్డులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం వృత్తి నైపుణ్యంలో మెలకువలు నేర్పించి షరతులు లేని బ్యాంక్ రుణాల కింద 2 లక్షలు ఇచ్చి వృత్తిని ప్రోత్సాహించాలని కోరారు.గత ప్రభుత్వం బడ్జెట్లో కేటాయించిన 450 కోట్లు రిలీజ్ చేసి ఈ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవీందర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎకర భూమి కేటాయించి ధోభీఘాట్లు మరియు కమ్యూనిటీ హాల్ ను ఏర్పాటు చేయాలని వారన్నారు. రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో వృత్తిదారులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.అశోక్ , జిల్లా సంయుక్త కార్యదర్శి సిహెచ్ వెంకటప్ప,కోడంగల్ కన్వీనర్ సిహెచ్ మోహన్,బిచ్చాల్ మొగులయ్య, డిస్ రాములు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, టెంట్ హౌస్ పాండు,బంద్యప్ప, శ్రీకాంత్, రాములు,చంద్రప్ప, భీమన్న,సి హెచ్,మొగులయ్య, లక్ష్మణ్,రాము రత్నమ్మ, మాణెమ్మ , నర్సమ్మ,రవి, అశోక్,కాశప్ప,మల్లప్ప, మెకానిక్ కాశప్ప, సాయిలు, శ్రీను, అనీల్, సురేష్,కె.రాములు,పరిగి రమేష్, రాములు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముప్పై ఏళ్ల కాలంలో దండోరా జెండా సమస్త పీడిత అణగారిన వర్గాలకు అండ





**ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ**

**చౌటుప్పల్, ( ప్రభాస్ సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం గ్రామంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షులు బొడ్డు శ్రవణ్ కుమార్ మాదిగ నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ డెబ్బై ఎనిమిది యేండ్ల స్వతంత్ర భారతదేశంలో ముప్పై ఏళ్లుగా సజీవంగా నిలబడి లక్ష్యాన్ని ముద్దాడిన ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ మాత్రమే అని, ఈ ముప్పై ఏళ్ల కాలంలో దండోరా జెండా సమస్త పీడిత అణగారిన వర్గాలకు అండగా నిలిచిందని అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించిన తరువాత , మంద కృష్ణ తన పేరు పక్కన మాదిగ అని చేర్చుకున్న తరువాత మాదిగ సమాజానికి ఎనలేని ధైర్యం కలిగింది. ఆ ధైర్యంతోనే మాదిగలంతా తమ పేరు పక్కన కులం పేరు చేర్చుకొని ఆత్మ గౌరవాన్ని చాటుకున్నారని అన్నారు.రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అందక పోవడం వల్లనే మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారు.కనుక జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలని మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ముప్పై ఏళ్ళు రాజీలేని పోరాటం సాగిందని అన్నారు. ఆ పోరాట ఫలితంగానే నేడు తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చిందని,దాని ద్వారా మాదిగలకు తొమ్మిది శాతం రిజర్వేషన్లు దక్కాయి.

ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న రిజర్వేషన్ ఫలాలు మాదిగ విద్యార్థులు నిరుద్యోగులు అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి రావాలని పిలుపునిచ్చారు.అలాగే ఎస్సీ వర్గీకరణతో పాటు ఆరోగ్యశ్రీ, వికలాంగులు , వృద్ధులు, వితంతువుల, ఒంటరి మహిళల పెన్షన్లు, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు , మహిళల భద్రత కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు మొదలగునవి ఎమ్మార్పీఎస్ సాధించి అన్ని వర్గాలకు అండగా నిలిచిందని అన్నారు . కనుక దండోరా జెండా సమస్త అణగారిన వర్గాలకు అండగా ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో జూలై 7 న ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా చేసుకోవాలని అన్నారు.ప్రతి గ్రామంలో దండోరా జెండా ఆవిష్కరణలు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో సభలు జరిపి ఉద్యమానికి తోడుగా ఉన్న అన్ని కులాల పెద్దలను సత్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ శాఖ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఎస్ లింగోటం ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ శాఖ అధ్యక్షునిగా చేగూరి శివకుమార్, ఉపాధ్యక్షుడిగా తూర్పింటి నవీన్ కూమార్, ప్రధాన కార్యదర్శిగా తూర్పిటి గణేష్, కార్యదర్శిగా పులిగిల్ల అనిల్, కోశాధికారిగా పిట్టల ఈశ్వర్,లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎర్ర గౌతమ్ మాదిగ, నాయకులు తూర్పింటి యాదయ్య, తూర్పింటి రాములు, తూర్పింటి బిక్షపతి, చేగూరి మల్లేష్, చేగురి శ్రీను, పిట్టల భిక్షమయ్య, పులిగిల్ల లింగస్వామి, పులిగిల్ల బిక్షపతి, బొగ్గుల ఇస్తారు, తూర్పింటి కిష్టయ్య , చేగురి నరసింహ, బండల నరసింహ, తూర్పుంటి విజయ్, తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణం కాపాడడం ప్రతి ఒక్కరి విధి: నందగిరి వెంకటేష్



**చౌటుప్పల్, ( ప్రభాత సూర్య):** పర్యావరణన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరి విధి అని బీజేపీ రెడ్డిబావి బూత్ అధ్యక్షులు నందగిరి వెంకటేష్ అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మండల పరిధిలోనీ రెడ్డిబావి గ్రామంలో పర్యావరణ సంరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ.. పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు కాపాడాలని, ప్రాణవాయువు ఇచ్చే చెట్లను పెంపొందించాలని, ఉద్దేశంతో గ్రామంలో యువత సమక్షంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చోటా స్కూల్, వెలంగని స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**చౌటుప్పల, ( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల మున్సిపల్ కేంద్రంలోని హనుమాన్ నగర్ నందుగల వెలంగని స్కూల్, శివాజీ నగర్ లోని చోటా స్కూల్ ఆధ్వర్యంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా విద్యార్థులు యోగాసనాలు,ధ్యానం, యోగ ముద్రలు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. రోజు ఒక గంట యోగ సాధన తో రోగ నిరోధ శక్తి పెంచుకొని అనారోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చని, యోగాసనాలు ముద్రలు ధ్యానం ద్వారా జీవనశైలి జబ్బులకు దూరంగా ఉంటూ శారీరకలసట మానసికలజడి ఒత్తిడిని అధిగమించి ఆనందంగా జీవించొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వలిగొండ, ( ప్రభాత సూర్య)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వేములకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002-03 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థుల 23 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. వేములకొండలోని శ్రీ మత్స్యగిరి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగణం అనంతరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం నాటి గురువులు దానయ్య, వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రాధాకృష్ణ, రమాదేవి, నరసింహ, నాగయ్య, శ్రీనివాస్, రవికుమార్,కనక సేన,హరికృష్ణ,వెంకన్న,మహేందర్ లను సత్కరించారు.జ్ఞాపికలు అందజేశారు. సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## 'మాస్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోదా మల్లికార్జున్ గౌడ్ నియామకం




**నాగోల్, ప్రభాత సూర్య :** మన ఆలోచన సాధన సమితి (మాస్) రాష్ట్ర స్థాయిలో కీలక నియామకాలు ఆదివారం జరిగాయి. మాస్ ప్రధాన కార్యాలయం నాగోల్‌లో అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు గారి నేతృత్వంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ తొలి సమావేశంలో గోదా మల్లికార్జున్ గౌడ్ గారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహ గౌడ్, దొంత ఆనందం నేత, పూస నరసింహ బెస్త తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేసిన అనంతరం గోదా మల్లికార్జున్ గౌడ్ నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు చేతుల మీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా గోదా మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు మాస్ వ్యవస్థాపకులు మరియు గౌరవ అధ్యక్షులకు కృతజ్ఞతలు. గ్రామీణ ప్రాంతాల్లో బీసీ కులాల మధ్య సఖ్యతను పెంపొందించడం, రాజకీయ, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యం. నా వంతు పాత్రను నిబద్ధతతో నిర్వర్తిస్తాను అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూరి గుడిసెల్లో ఉన్నవాళ్లుకు, మొత్తమే ఇల్లు లేని పేదవాళ్ళకే ఇల్లు ఇవ్వాలి



**నారాయపూర్ ప్రభాత సూర్య ప్రతినిధి జూన్ 22:** యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు రెండో విడతలో పూర్తి పేదవాలను చూసి పూర్తి విచారణ జరిపి ఎటువంటి రాజకీయం చేయకుండా ఎంపిక జరగాలని ,తొలి విడతలో 40 ఇండ్లు వచ్చాయి కానీ ఇంకా పూరి గుడిసెల్లో ఉన్నవాళ్లు ఉన్నారు,కనుక ఊర్లో పూర్తి వివరాలు సేకరించి ఎవరైతే అర్హులు ఉన్నారో వారికి రెండో విడత ఇండ్ల పట్టాలు ఇప్పించాలని గ్రామ కార్యదర్శి గారిని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బండమిది కిరణ్ కోరడం జరిగింది, అందులో భాగంగా కొంతమంది పూరి గుడిసెల్లో ఉండే వారి ఫోటోలు దింపి వారి పేర్లను లిఖితపూర్వకంగా వారికి ఇవ్వడం జరిగింది.

## ధాన్యం టెండర్ల స్కాంపై మౌనం ఎందుకు..?

### మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**హైదరాబాద్ :** ధాన్యం టెండర్లలో 1100 కోట్ల కుంభకోణం జరిగిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అసెంబ్లీలో కేటీఆర్, హరీష్ రావు మాట్లాడిన ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కోర్టులో బీఆర్ఎస్ ఈ వ్యవహారంపై పిటిషన్ దాఖలు చేసిందని తెలిపారు. అయితే విచారణ సందర్భంగా ప్రభుత్వం కౌంటర్ దాఖలు 16 సార్లు వాయిదా కోరడంలో అంతర్యం ఏంటని నిలదీశారు. అన్ని ఆధారాలతోవిజిలెన్స్ కమిషన్‌కి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆక్షేపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీష్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి పెద్ది సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ధాన్యం టెండర్లలో కేవలం నలుగురు బిడ్డలు మాత్రమే పాల్గొన్నారు. మద్దతు ధరకు మించి మిల్లర్ల వద్ద రూ. 2230లకు క్వింటాల్ చొప్పున 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని.. ఇందులో 1100 కోట్ల కుంభకోణానికి తెరలేపారని చెప్పారు. దీనిపై 270 మంది బ్యాంకు ఖాతాలు సేకరించి నగదు బదిలీ అయినట్టు ఆధారాలతో బీఆర్ఎస్ బట్టబయలు చేసిందన్నారు. ఈ స్కామ్ లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి హస్తం ఉన్నదని ఆరోపించారు. అక్రమాల ద్వారా సమకూరిన 1100 కోట్లలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు 10 కోట్ల చొప్పున అందజేశారని, ఇందులో కొంత మొత్తాన్ని ఢిల్లీకి మూటలు పంపారని విమర్శించారు.. మిగిలిన మొత్తాన్ని సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ పంచుకున్నారని ధ్వజమెత్తారు. ఈ కుంభకోణంపై బీజేపీ మంత్రులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. వారికి చిత్తశుద్ధి ఉంటే సిబిఐ, ఈడి విచారణ కోరాలని డిమాండ్ చేశారు. లేదంటే రెండు పార్టీలు ఒకటే అనే విషయం ఒప్పుకోవాలన్నారు. ధాన్యం కుంభకోణంపై ప్రభుత్వం స్పందించకుంటే సివిల్ సప్లై కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కేటీఆర్ విదేశాల నుంచి రాగానే ఇన్దుకు సంబంధించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

## పాలమూరులో డిఫెన్స్ ప్రాజెక్టు

**మహబూబ్ నగర్ :** మహబూబ్ నగర్ జిల్లాలో ప్రతిష్టాత్మక రక్షణ రంగ ప్రాజెక్ట్ ఏర్పాటు పై ఆశలు రేకెత్తుతున్నాయి. సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరణకు దేవరకద్ర మండలంలో అవకాశాలను పరిశీలిస్తున్నారు శాస్త్రవేత్తలు, అధికారులు. ఇందుకోసం ప్రభుత్వ తరపున అన్ని విధాల సహకరిస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు.త్వరలోనే రాష్ట్రంలో మరో బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్... అక్కడ ఏర్పాటుకు స్థల పరిశీలనగడచిన కొన్నేళ్లుగా దేశ రక్షణ వ్యవస్థను బలోపేతంపై భారత్ దృష్టి సారించింది. ఈ క్రమంలోనే సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత బ్రహ్మోస్ క్షిపణుల ఉత్పత్తిని పెద్ద ఎత్తున పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ లోని బాలాపూర్ లో ఈ క్షిపణుల తయారీ యూనిట్ నెలకొల్పబడి ఉంది. దీన్ని విస్తరించాలనే ప్రణాళికలో భాగంగా స్థలాల కోసం అన్వేషణ సాగుతోంది. అయితే ఈ నెల 18న హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డితో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతినిధులను కోరారు. డిఫెన్స్ కారిడార్ ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలు అనుకూలమైనవన్నారు. ఇప్పటికే హైదరాబాద్ లో పలు డిఫెన్స్ సంస్థలున్న నేపథ్యంలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను సైతం విస్తరించాలని కోరారు. ఇందుకోసం ప్రభుత్వ తరఫున అన్ని విధాల సహకరిస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు.అలా సమావేశం ముగిసి మూడు రోజులు గడవకు ముందే బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో స్థల పరిశీలన చేపట్టారు. ఆఖీఆఒ జనరల్ ఆఫ్ బ్రహ్మోస్ డైరెక్టర్ డా, జైతీర్థ్ జోషి, ఆఖీఆఒ డైరెక్టర్ డా,జీ.ఏ శ్రీనివాస్ మూర్తి, బ్రహ్మోస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా, జీ. ఎ.ఎస్ సాంబశివప్రసాద్ మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని చౌదర్ పల్లి, బస్వాయిపల్లి గ్రామ శివారులోని భూముల పరిశీలించారు. వీరికి తోడుగా స్థానిక ఎమ్మెల్యే జీ మధుసూధన్ రెడ్డి సైతం భూముల పరిశీలనలో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్, అనుబంధ సంస్థలకు అనుకూలంగా ఉంటుందని భావించారు. ఔఊ 44, ఔఊ 167 కు మధ్యలో ఉన్న ప్రాంతం కావడంతో రవాణా సౌకర్యాలు అనుకూలంగా ఉన్నాయి. అయితే పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని అధికారులు చెప్పారు.ఇక తాజా స్థల పరిశీలనతో హైదరాబాద్ ? బెంగళూరు డిఫెన్స్ కారిడార్ మళ్ళీ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం స్థల పరిశీలన జరిగిన ప్రాంతంలో బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు జరిగితే డిఫెన్స్ కారిడార్ కు వేగంగా అడుగులు పడే అవకాశం ఉంది. మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటైతే ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. మిస్సైల్ కు అవసరమయ్యే విడిభాగాలు తయారీకి సంబంధిత ఓూఓఇ పరిశ్రమలు అవసరం ఉంటుంది. దీంతో ఇలాంటి వాటితో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించే ఆస్కారం ఉంది.ఇక బ్రహ్మోస్ క్షిపణిని భారత బ్రహ్మాస్త్ర గా భావిస్తారు. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన క్షిపణుల్లో బ్రహ్మోస్ ఒకటి. తక్కువ ఎత్తులో ఎగురుతూ శత్రువుల యాంటీ మిస్సైల్ సిస్టమ్ లకు దొరక్కుండా దూసుకుపోతాయి. బ్రహ్మోస్ క్షిపణుల్లో నాలుగు రకాలు భారత్ వద్ద ఉన్నాయి. ఉపరితలం నుంచి ఉపరితలం, ఆకాశం నుండి ఉపరితలం, సముద్రం నుండి ఉపరితలం, నీటి అడుగు నుంచి అంటే జలాంతర్గాముల నుంచి ఉపరితలానికి ప్రయోగించగలవి. ఈ బ్రహ్మోస్ క్షిపణులు ధ్వని వేగం కంటే 2.8 రెట్లు ఎక్కువ వేగంతో దూసుకుపోతాయి.

## విజయవంతంగా 'సే నో టూ డ్రగ్స్.. అండ్ ఎస్ టూఫ్ లైఫ్' సైక్లోథాన్




నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ విభాగం నిర్వహించిన సైక్లోథాన్ విజయవంతమైంది. జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ సైక్లోథాన్‌ను నిర్వహించింది. నార్కోటిక్ సెంట్రల్ బ్యూరో ఆధ్వర్యంలో జూన్ 21న సే నో టూ డ్రగ్స్ అండ్ ఎస్ టూఫ్ లైఫ్ అనే నినాదంతో ఈ సైక్లోథాన్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం ఉదయం నానక్ రామ్ గూడా స్టార్ ఆస్పత్రి నుంచి ఈ రైడ్ జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైక్లోథాన్‌తో పాటు పలువురు ముఖ్య అతిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు చేయడం సరికాదు

**గుమ్మనూరు పై విమర్శలు తగదు...**
**వైసీపీ ప్రభుత్వానికి డైరెక్షన్ రాజకీయాలు మాత్రమే తెలుసు..**
**గత ఐదు ఏళ్లు మీ అవినీతిని చూసి గద్దదించారు**
**రాప్పా రాప్పా అంటు ఇంకా ఎంతమంది బలి తీసుకుంటూరు.**
**అనంతపురం బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య**



**అనంతపురం, ( ప్రభాత సూర్య):** ఏడాది పాలనలో అభివృద్ధి చేసిన కూటమి ప్రభుత్వాన్ని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పై విమర్శలు చేసిన అనంతపురం వైసిపి అధ్యక్షుడు అనంత వెంకట్రాం రెడ్డి పై అనంతపురం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య మండిపడ్డారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... గత వైసిపి ఎమ్మెల్యే వెంకట్రాంరెడ్డి అవినీతిని చూడలేక కర్నూలు నుంచి వచ్చిన గుమ్మనూరు జయరామును అత్యధిక మెజారిటీతో గుంతకల్ నియోజకవర్గంలో ప్రజలు గెలిపించారన్నారు. మీడియా ముందు రాప్పా రాప్పా అంటూ వ్యాఖ్యలు చేసిన జగన్మోహన్ రెడ్డి పై సుంటో కేసు నమోదు చేయాలని అన్నారు. గతంలో తన తాత తండ్రి ఎంతో మందిని బలి తీసుకున్నారని.. ఇప్పుడు అదే మార్గంలో జగన్ అధికారంలోకి వచ్చాక నరుకుతామంటే మేము చూస్తూ ఊరుకుంటామా అంటూ ఫైర్ అయ్యారు. మీ నాయకుడు చేసిన పనులు వల్ల గ్రామాల్లో వైసిపి కార్యకర్తలు నాయకులు రెచ్చిపోతున్నారని దీని వల్ల ఘర్షణలో తలిస్తే ఎవరు బాధ్యత తీసుకుంటారు అన్నారు. ఇప్పటికే మీ అరాచకాల వల్ల మా టిడిపి కార్యకర్తలతో పాటు వైసిపి నాయకులు కూడా చాలా పోగొట్టుకున్నారన్నారు. నాయకుడంటే తను సంయ మనంగా ఉంటూ.. క్యాడర్ను క్రమశిక్షణగా నడిపించేవాడని ఇలా రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే వారు నాయకులు కాదన్నారు. అనంతపురం వైసిపి అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి కుట్రలు రాజకీయాలు చేస్తూ ఎంతమందికి అన్యాయం చేశారన్నారు. మీరు చేసిన పనులు వల్లే మీ పార్టీ నాయకులే గడిచిన ఎన్నికల దారుణంగా ఓడించారు అన్నారు.

# యాదవులను నిర్లక్ష్యం చేస్తే గుణపాఠం తప్పదు

**–గొర్రెల పెంపకం దారుల సమావేశంలో యాదవ సంఘం నాయకుల డిమాండ్**



**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** ఖమ్మం జిల్లాలోనే కాకుండా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటుకు యాదవులు కీలక పాత్ర వహించారని ఏరు దాటాక తెప్ప తగిలేసినట్లు గా రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు రాజకీయ ప్రాతినిధ్యం కలిగించకుండా మొండి చేయి చూపించిందని భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలోగాని జిల్లా రాష్ట్రస్థాయి నామినేట్ పదవులలోగాని యాదవులను నిర్లక్ష్యం చేస్తే తగిన గుణపాఠం తప్పదని అఖిల భారత యాదవ మహాసభ మరియు జిల్లా గొర్రెల పెంపకం దారుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిలభారత యాదవ మహాసభ మరియు జిల్లా గొర్రెల పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో గొర్రెల సంఘాల అధ్యక్ష కార్యదర్శుల సమావేశం జిల్లా గొర్రెలు పెంపకం దారుల సంఘం నాయకులు మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నాడు ఖమ్మం బైపాస్ రోడ్ లోని స్థానిక రామకృష్ణ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షులు గొర్రెల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా 1992- 93 లో గొర్రెల సంఘాలను ఏర్పాటు చేసింది, యాదవులకు గొర్రెల మేకల పెంపకం దారుల ఫెడరేషన్ ఏర్పాటు చేసింది. ఫెడరేషన్ కు నిధులు సమకూర్చింది తద్వారా ఎన్సిడిసి స్కీమును తదితర స్కీములను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గతంలో యాదవులను గుర్తించి రాజకీయ ప్రాధాన్యత కల్పించింది కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని మళ్లీ ఇప్పుడు ఏర్పాటైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం యాదవులను తప్పక గుర్తిస్తుందని యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని సభాముఖంగా కోరారు. జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం జిల్లా కురుమ సంఘంఅధ్యక్షులు చిన్నం మల్లేష్ ప్రధాన కార్యదర్శి పగడాల మధు జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దుబాకుల శ్రీనివాస్ బిజెపి జిల్లా నాయకులు అల్లిక అంజయ్య యాదవ్ మేకల నాగేశ్వరరావు లతో పాటు సమావేశమంతా దాదాపు 30 సంవత్సరాలు పైబడి జిల్లా గొర్రెల సంఘాలను యాదవులను అభివృద్ధి పరుస్తూ చైతన్యం కలిగించిన మల్లిబాబు యాదవ్ కు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి కల్పించాలని ఏకవాక్య తీర్మానంతో డిమాండ్ చేశారు. యాదవులే రాజకీయ నిర్ణేతలుగా ఉండాలని యాదవులు కురుమలు రాజకీయాలు వర్గాలు కతీతంగా ఏకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని గతంలో డిసిసిబి చైర్మన్ లాంటి పదవులు వచ్చాయంటే మనందరి ఐక్యత వలన సాధ్యపడిందని ఇప్పుడు కూడా గొర్రెల సంఘాల హక్కుల కొరకు రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వక్తలు పిలుపునిచ్చారు. యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యాదవులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కార్పొరేషన్ పరిధిలోని యాదవులకు గొర్రెలకు బదులు పాడి గేదెలు మంజూరు చేయాలని ఎన్సీడీసీ ఎస్ ఆర్ డి పి స్కీమును పునరుద్ధరిం చాలని గొర్రెల మార్కెట్ యార్డ్ కొరకు కేటాయించిన స్థలమును అభివృద్ధి పరచాలని ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరికి పది లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని పలు డిమాండ్లు చేశారు. ఈ సందర్భంగా గొర్రెల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శిగా మేకల నాగేశ్వరరావు మండలాల అధ్యక్షులు గా నేలకొండపల్లి మల్లెబోయిన ఉపేందర్ రఘునాథపాలెం- మంద నాగేశ్వం రావు తిరుమలాయపాలెం- మేకల సైదులు ఖమ్మం రూరల్ - మెండె వెంకటేష్ గోపరాజు యాదవ్ వర్ధబోయిన నరసింహా రావు- ఏన్కూరు మద్దిబోయిన పంపాద్రి తల్లాడ ఎనుముల రాము - కల్లూరు పదిమల నరేష్- కొణిజర్ల జెట్టి రామారావు వేంసూరు కర్రి కుటుంబరావుపె నుబల్లి అదేవిధంగా తదితర మండలాలకు అధ్యక్ష నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల వెంకటేశ్వర్లు చంద్రకాని గట్టయ్య తెల్లబోయిన రమణ గూదే భద్రయ్య మల్లె పోయిన శ్రీనివాస్ తుప్పాతి రవికుమార్ ఎనుముల రుక్మిణి కనక బండి విజయలక్ష్మి నూకల సైదులు మొరిమేకల కోటయ్య సత్తి వెంకన్న బట్ట కోటేశ్వరరావు జోనబోయిన పాపయ్య మారుతి ఎట్టయ్య బండారు రాములు మరియు తదితర గొర్రెల సంఘాల నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# కొండా దంపతులపై నేతలు తిరుగుబాటు

**వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. ఇన్నాళ్లు నివురు గప్పిన నిప్పులా ఉన్నా కోల్డ్‌వార్ కొండా మురళీ వ్యాఖ్యలతో ఇప్పుడు బహిర్గతమైంది. మంత్రి కొండా సురేఖతో ఎమ్మెల్యేలకు కొనసాగుతున్న పొలిటికల్ గ్యాప్‌ను మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు వ్యాఖ్యలు బహిర్గతం చేస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య గత కొద్దిరోజులుగా చాటుమాటుగా సాగుతున్న రాజకీయ కుట్రలు.. ఇప్పుడు ప్రత్యక్షంగా విమర్శలు చేసుకునే స్థాయికి చేరుకున్నాయి.వరంగల్ కాంగ్రెస్ పార్టీలో కొండా దంపతులు వర్సెస్ ఇతర నేతలన్నట్లుగా పరిస్థితి మారింది. మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత కొండా మురళి స్వంత పార్టీ ఎమ్మెల్యే పై చేసిన వ్యాఖ్యల పై ఆపార్టీ ఎమ్మెల్యేలు, నేతలు హన్మకొండ లోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. వరంగల్ కాంగ్రెస్ పార్టీకి కొండా దంపతులు పెద్ద సమస్యగా మారారు. మంత్రిగా ఉండి పార్టీకి డ్యామేజ్ అయ్యేలా కొండా సురేఖ తరచూ మాట్లాడుతూం టారు. ఆమె వల్ల ప్రభుత్వం తో పాట ?ఇతర మంత్రులకూ సమస్యలు వస్తున్నాయి. తాజాగా కొండా మురళి కూడా రెచ్చిపోతున్నారు. గురువారం ఆయన అనుచరులతో సమావేశం పెట్టి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడారు. రేవూరి ప్రకాష్ రెడ్డి, కడియం శ్రీహరిలతో పాటు ఇతర కాంగ్రెస్ నేతల్ని కించ పరుస్తూ మాట్లాడారు. కొండా సురేఖ మంత్రి పదవి ఎక్కడికీ పోదని చాలెంజ్ చేశారు.కొండా దంపతుల వ్యవహారం రాను రాను గీత దాటిపోతూండటంతో.. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆపార్టీ ఎమ్మెల్యేలు, నేతలు హన్మకొండ లోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నేతలపై వ్యాఖ్యలు చేయడం సరికాదని ఇప్పటి వరకూ కొండా దంపతులను భరిస్తున్నామని .. ఇక తమ వల్ల కాదని వారు తేల్చేశారు. త్వరలో పార్టీ ఇంచార్జి మీనాక్షి నరాజన్ కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కొండ దంపతులు కులాలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని, పార్టీకి నష్టం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు.కొండా దంపతులు ఏ పార్టీలో ఉన్నా ఇదే సమస్య. వారు ఎవరితోనూ సఖ్యతగా ఉండరు. ఆధిపత్యం అంతా తమదే ఉండాలని అనుకుంటారు. గతంలో ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడు అయిన వేం నరేందర్ రెడ్డిని కూడా బెదిరించినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు పార్టీ నేతలంతా కలిసి కొండా సురేఖకు వ్యతిరేకంగా మారడంతో.. వారికి ఇక ముఖ్యమంత్రి అటు ప్రభుత్వ పరంగా.. ఇటు పార్టీ పరంగా ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు తగ్గిపోయాయి. ఇప్పటికే మెదక్ ఇంచార్జ్ మంత్రిగా ఉన్న ఆమెను తొలగించారు.మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నేతలపై వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కొండా దంపతులను భరిస్తున్నామని, ఇక బరించలేమని నాయిని అన్నారు. త్వరలో పార్టీ ఇంచార్జి మీనాక్షి నరాజన్ కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కొండ దంపతులు కులాలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని, పార్టీకి నష్టం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నివాసంలో సమావేశమైన వారిలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాగరాజ్, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతోపాటు ముఖ్యనేతలు అన్నారు.

### మంత్రి వర్సెస్ ఎమ్మెల్యేలు

కొద్దిరోజులుగా మంత్రి కొండా సురేఖకు మంత్రి వర్గం నుంచి ఉద్వాసన పలుకుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందుకు ఇటీవల జరిగిన కొన్ని ఘటనలను ఉదాహరిస్తూ పార్టీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు ఈ ప్రచారం సాగిస్తున్నట్లుగా కొండా వర్గం భావిస్తూ వస్తోంది. అయితే ఇటీవల కొండా మురళీకి వరంగల్ డివిజన్ పోలీసులు ఎస్కార్ట్ ఇవ్వడాన్ని తప్పుబట్టిన కాంగ్రెస్ పార్టీకే చెందిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లుగా తెలుస్తోంది. సదరు పోలీసులకు సీపీ సన్ ప్రీత్‌సింగ్ మెమోలు జారీ చేయడంతో ఈ పరిణామం రాజకీయ రంగు పులుముకుంది. గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కార్పోరేటర్‌పై అత్యాచారం యత్నం, అట్రాసిటీ కేసు నమోదు కావడం వెనుక ఆయన అనుచరవర్గం నేతలు ఉన్నారని, ఈ విషయంపై ఓ సీనియర్ ప్రజాప్రతినిధి సీపీనికలవడం, తదుపరి సీఎం రేవంత్ రెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఈ పరిణామం వరంగల్ తూర్పులో మరింత పొలిటికల్ హీట్‌ను పెంచేసింది. కొండా దంపతులు ఆధిపత్యం ప్రదర్శించే వైఖరితో వ్యవహరిస్తున్నారనే వైఖరితో మిగతా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు సైతం వారి నియోజకవర్గాలకు ఆహ్వానించడం లేదు. అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రికి ఆహ్వానం పలకకపోవడం, పార్టీ సమావేశాల్లోనూ జిల్లా ఎమ్మెల్యేలతో మంత్రి సురేఖ ఎడమొహం, పెడమొహం అన్నచందంగా వ్యవహరిస్తున్నారు. మంత్రి వర్సెస్ ఎమ్మెల్యేలుగా పరిస్థితి మారింది. వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనల సందర్భంగా మినహా ప్రత్యేకంగా జిల్లా మంత్రి హోదాలో సురేఖ ఉమ్మడి జిల్లా నియోజకవర్గ పర్యటనల్లో పాల్గొన్నది బహు తక్కువనే చెప్పాలి.ఇన్నాళ్లు కోల్డ్‌వార్ స్థాయిలోనే ఉన్న వర్గపోరు.. ఇప్పుడు ప్రత్యక్షంగా వేదికలపై విమర్శలు చేసే స్థాయి చేరుకుంది. మంత్రి సురేఖ పదవి పోతోందనే ప్రచారంపై కొండా మురళీధర్‌రావు ఇప్పుడు మాస్ వార్నింగ్‌లు ఇవ్వడంపై కాంగ్రెస్ పార్టీ నేతలను సైతం షాక్‌గా గురి చేసింది. ఇతర పార్టీల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు దమ్ముంటే రాజీనామాలు చేసి గెలవాలంటూ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలను ఉద్దేశించి సవాల్ విసిరారు. గెలిపించాలని తన కాళ్లు పట్టుకున్నాడంటూ పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిపై వ్యాఖ్యనించారు. ఇదిలా ఉండగా గత కొంతకాలంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం కొండా దంపతులపై ఫిర్యాదులు చేస్తూ వస్తున్నట్లు

# అదృష్టాన్ని తెలియజేసే పుట్టుమచ్చలు



పురాతన కాలం నుంచి శరీరంపై ఉన్న పుట్టుమచ్చలు ఒక వ్యక్తి అదృష్టం, భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయి. సాముద్రిక శాస్త్రం ప్రకారం మానవుడి జాతకాన్ని నిర్ధేశించడంలో పుట్టుమచ్చలదీ ఓ పాత్ర అని చెప్పవచ్చు. శరీరంలోని వివిధ భాగాలపై ఉన్న పుట్టుమచ్చలు వ్యక్తుల స్వరూప స్వభావాలను తెలుపడంతో పాటు కొన్ని ప్రత్యేక సూచనలను ఇస్తాయి. ఇవి ఒక వ్యక్తి వ్యక్తిత్వం, సంపద, ఆనందాన్ని ప్రతిబింబిస్తాయి. శరీరంపై పుట్టుమచ్చలు కేవలం అందానికి గుర్తు మాత్రమే కాదు. అవి అదృష్ట.. దురదృష్టాలకు కూడా సంకేతం. సాముద్రిక శాస్త్రం, జ్యోతిష్యం ప్రకారం శరీరంలోని కొన్ని భాగాలపై పుట్టుమచ్చలు ఉండటం శుభ సంకేతంగా పరిగణించబడుతుంది. ఇవి మానుషి ఉజ్వల భవిష్యత్తు, సంపద, కీర్తి , ఆనందాన్ని సూచిస్తాయి. నుదిటిపై ఉన్న పుట్టుమచ్చ ఎవరికైనా నుదిటి కుడి వైపున పుట్టుమచ్చ ఉంటే..అది చాలా శుభప్రదంగా పరిగణించబడుతుంది. అలాంటి వ్యక్తులు ధనవంతులు, విజయవంతమైనవారు, సామాజికంగా గౌరవించబడతారు. వీరు తమ కృషి, అంకితభావంతో ప్రతి రంగంలోనూ విజయం సాధిస్తారు. మరోవైపు నుదిటి ఎడమ వైపున ఉన్న పుట్టుమచ్చ కొంతవరకు దుబారా చేసే స్వభావాన్ని సూచిస్తుంది. కనుబొమ్మల మధ్య పుట్టుమచ్చ రెండు కనుబొమ్మల మధ్యలో పుట్టుమచ్చ ఉండటం కూడా చాలా శుభప్రదంగా పరిగణించబడుతుంది. అలాంటి వ్యక్తులు పదునైన తెలివితేటలు కలిగి ఉంటారు. దూరదృష్టితో పని చేస్తారు. వీరు ప్రశాంత స్వభావం కలిగి ఉంటారు. ఆధ్యాత్మిక ధోరణి కలిగి ఉంటారు. వీరి జీవితంలో ఎప్పుడూ డబ్బు కొరతను ఎదుర్కోవాల్సిన అవసరం కలుగదు. ముక్కు మీద పుట్టుమచ్చ ముక్కు మీద పుట్టుమచ్చ ఉండటం కూడా అదృష్టానికి సంకేతం. ముక్కు చివర పుట్టుమచ్చ ఉన్న వ్యక్తులు తరచుగా ప్రయాణించడానికి ఇష్టపడతారు. వీరు తమ జీవితంలో చాలా ప్రయాణాలు చేస్తారు. అలాంటి వ్యక్తులు ఉల్లాసంగా , శక్తివంతంగా ఉంటారు. వీరు తాము చేసే వ్యాపారంలో మంచి విజయాన్ని పొందుతారు. పెదవి పైన పుట్టుమచ్చ పై పెదవి కుడి వైపున ఉన్న పుట్టుమచ్చ ఆ వ్యక్తి స్వభావరీత్యా చాలా ఆప్యాయంగా, ఉదారంగా ఉంటాడని సూచిస్తుంది. ఇలాంటి వ్యక్తులు ఇతరులకు సహాయం చేస్తారు. దయతో ఉంటారు. వీరికి జీవితంలో చాలా ప్రేమ, గౌరవం లభిస్తుంది. అరచేతిలో పుట్టుమచ్చ వ్యక్తి కుడి అరచేతిలో ముఖ్యంగా ఉంగరపు వేలు లేదా చిటికెన వేలు కింద పుట్టుమచ్చ ఉంటే.. అది సంపద , అదృష్టానికి సూచిక. అలాంటి వ్యక్తులు ఆర్థికంగా బలంగా ఉంటారు . జీవితంలో అన్ని సౌకర్యాలను పొందుతారు. మరోవైపు ఎడమ అరచేతిలో ఉన్న పుట్టుమచ్చ ఉన్న వ్యక్తులు కొంచెం కష్టపడవచ్చు. అయితే వీరు చివరికి విజయం సాధిస్తారు. అరికాళ్ళపై పుట్టుమచ్చ అరికాళ్ళపై పుట్టుమచ్చ ఉండటం కూడా శుభప్రదంగా పరిగణించబడుతుంది. ఇలాంటి ప్లేస్ లో పుట్టుమచ్చ ఉన్నవారు ఎక్కువగా ప్రయాణాలు చేస్తారు. విదేశాలకు వెళ్ళే అవకాశం కూడా ఉంది. వీరు ధైర్యంగా ఉంటారు. సవాళ్లను ఎదుర్కోవడానికి భయపడరు. వీరు సమాజంలో గౌరవం పొందుతారు. కడుపు మీద పుట్టుమచ్చ కడుపుపై ఉన్న పుట్టుమచ్చలు సంపద , మంచి ఆహారం పట్ల మక్కువను సూచిస్తాయి. పుట్టుమచ్చ నాభి దగ్గర ఉంటే.. ఆ వ్యక్తి సంపదను పొందుతాడు . సౌకర్యవంతమైన జీవితాన్ని గడుపుతాడు. అయితే కొన్ని సందర్భాల్లో కడుపు మీద పుట్టుమచ్చ అతిగా తినే అలవాటును కూడా సూచిస్తుంది.

# యోగాని కెరీర్‌గా ఎలా ఎంచుకోవాలి?



యోగా ధ్యానం, ఆసనాలు ఆరోగ్యాన్ని ఇస్తాయి. యోగా ఇందుకే ఉపయోగపడుతుందని మీరు అనుకుంటే పొరపాటు. ఎందుకంటే ఇప్పుడు యోగాకి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉంది. దీంతో యోగా ఒక వృత్తిగా ప్రపంచ ట్రెండ్‌గా మారింది. మన దేశంలో యోగాని అభ్యసించడానికి మాత్రమే కాదు యోగా టీచర్ గా చేసేందుకు కూడా అనేక యోగా కోర్సులు ఉన్నాయి. వీటిని చేయడం ద్వారా యువత మెరుగైన కెరీర్‌ను ఎంచుకుని సంపాదించుకోవచ్చు.ఎవరైనా యోగాని తమ కెరీర్ ఎంచుకోవాలనుకుంటే లేదా యోగా టీచర్‌గా ఉద్యోగం కోసం చూస్తున్నట్లయితే.. ఇప్పుడు మేము ఇస్తున్న సమాచారం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. యోగా కేవలం సాధన లేదా ఆసనాలకే పరిమితం కాదు.. నేడు ఇది భారతదేశంలోనే కాదు విదేశాలలో కూడా ప్రజలను ఆకర్షించే వృత్తిగా మారింది. ఆరోగ్యం, ఫిట్‌నెస్ పై శ్రద్ధ పెడుతున్న నేటి సమయంలో యోగాను మెరుగైన కెరీర్ ఎంపికగా చూస్తున్నారు. యోగా అనేది ఆధ్యాత్మిక శాంతిని, వృత్తిపరమైన వృద్ధిని అందించే రంగం. ఎవరైనా యోగా శిక్షకుడు, పరిశోధకుడు, చికిత్సకుడు లేదా కార్పొరేట్ యోగా బోధకుడు కూడా కావచ్చు. ప్రస్తుతం రిసార్ట్‌లు, జిమ్‌లు, పాఠశాలలు, ఆసుపత్రులు, కార్పొరేట్ ఆఫీసులు, టీవీ ఛానెల్‌లలో కూడా యోగా నిపుణులకు డిమాండ్ ఉంది. కోవిడ్ తర్వాత ఆన్‌లైన్ యోగా తరగతులు కూడా విపరీతమైన విజయాన్ని సాధించాయి. ఇంటి నుండే ప్రపంచ క్లయింట్‌లతో కనెక్ట్ అయ్యే అవకాశాన్ని ఇచ్చాయి. యోగాలో కెరీర్‌ను ఏర్పరచుకోవడానికి సర్టిఫికేట్ నుంచి డిగ్రీ వరకు కోర్సులు ఉన్నాయి. అభ్యర్థులు ప్రాథమిక శిక్షణ, యోగా పరిజ్ఞానం కోసం 1.5 నెలల సర్టిఫికేట్ కోర్సు చేయవచ్చు. 12వ తరగతి ఉత్తీర్ణత తర్వాత ఈ సర్టిఫికేట్ కోర్స్ చేయవచ్చు. దీని ఫీజు రూ. 1,200 నుంచి రూ. 16,000 వరకు ఉంటుంది. అంతేకాదు యోగి సైన్స్, నేచురోపతి లేదా యోగా థెరపీలో డిప్లొమా కోర్సు చేయవచ్చు. గ్రాడ్యుయేషన్ తర్వాత ఎవరైనా ఈ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. దీని ఫీజు రూ. 20,000 నుంచి రూ. 59,000 వరకు ఉంటుంది.

# భద్రకాళి అమ్మవారి బోనాలు తాత్కాలిక వాయిదా..

వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనాల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమ్మవారికి బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం గతంలో తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అయితే, ఇటీవల భద్రకాళి బోనాలకి సంబంధించి కొంత మంది నుంచి అభ్యంతరాలు రావడంతో పాటు సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచురితమైన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి పేర్కొన్నారు. వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం గతంలో తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అయితే ఇటీవల భద్రకాళి అమ్మవారి బోనాలకి సంబంధించి కొంత మంది నుంచి అభ్యంతరాలు రావడంతో పాటు.. పలు సోషల్ మీడియా మాధ్యమాల్లో ఈ విషయంపై తప్పుడు వార్తలు ప్రచురితమైన దృష్ట్యా, ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం స్థానికంగా నెలకొన్న రాజకీయ విభేదాలను.. పవిత్రమైన అమ్మవారికి ముడి పెట్టి కొందరు ఉద్దేశపూర్వకంగానే ఇబ్బందులు సృష్టిస్తారమోనని భావించి.. ఈ కార్యక్రమంలోకి అసాంఘిక శక్తులను ప్రేరేపించి గొడవలు సృష్టిస్తారనే అనుమానంతో బోనాల నిర్వహణ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇదిలా ఉండగా భద్రకాళి అమ్మవారి ఆలయ పరిధిలో శాఖాహార బోనాలే ఉంటాయని ప్రభుత్వం గతంలోనే పలుమార్లు తెలియజేసిందని మంత్రి కొండా సురేఖ గుర్తుచేశారు. కానీ ప్రభుత్వం ఆలయంలో




మాంసాహారంతో బోనాలు నిర్వహించేందుకు చూస్తోందని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు. ఇలాంట ప్రచారాలు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్ళాయని.. రాజకీయాల కోసం భక్తుల మనస్సుల్లో దుష్ప్రచారం నింపడం మంచిది ఆమె మంత్రి సురేఖ అన్నారు. ఈ కారణంతోనే ఈ నెల 22న భద్రకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహించాల్సిన బోనాలు రద్దు చేయడం జరిగిందని మంత్రి సురేఖ ప్రకటన విడుదల చేశారు.

# ఈ 3 తేదీల్లో జన్మించిన వారు ఎప్పుడూ కోపంతో ఉంటారు



కొంత మంది జ్యోతిష్యం ద్వారా భవిష్యత్ ని, వ్యక్తిత్వాన్ని తెలుసుకుంటే.. మరికొందరు సంఖ్యాశాస్త్రం ద్వారా తెలుసుకుంటారు. సంఖ్యాశాస్త్రం అంటే మనిషి జీవితాన్ని ప్రభావాలను అధ్యయనం చేసే ఒక పద్ధతి. ఇది సంఖ్యలు, వ్యక్తిత్వం, సంఘటనలు, ఇతర విషయాల మధ్య సంబంధాలను పరిశీలిస్తుంది. ఈ రోజు ఈ రోజు కొన్ని తేదీల్లో జన్మించిన వ్యక్తుల వ్యక్తిత్వాన్ని గురించి తెలుసుకుందాం. వీరు చాలా సహాయకారిగా ఉంటారు. ప్రతి వ్యక్తి పుట్టిన తేదీలో రోజు, నెల, సంవత్సరం మాత్రమే కాదు అతని స్వభావం, ఆలోచనా విధానం, ప్రత్యేక జీవన విధానం కూడా దాగి ఉన్నాయి. సంఖ్యాశాస్త్రం ఈ రహస్యాన్ని వెల్లడించే ఒక పురాతన శాస్త్రం. సంఖ్యాశాస్త్రం ప్రకారం మనం పుట్టిన తేదీ అంకెలను జోడించినప్పుడు.. మన జీవిత ముగింపు అయిన రాడిక్స్ అని పిలువబడే ఒక మూల సంఖ్య మనకు లభిస్తుంది. ఈ రాడిక్స్ 1 నుంచి 9 వరకు ఏదైనా కావచ్చు. అలాగే ప్రతి సంఖ్య ఒక నిర్దిష్ట గ్రహంతో ముడిపడి ఉంటుంది. అటువంటి పరిస్థితిలో ఈ రోజు నెలలో ఈ 3 తేదీలలో జన్మించిన వ్యక్తుల గురించి తెలుసుకుందాం.. వీరి స్వభావం అత్యంత కోపం. కనుక ఈ మూడు తేదీలలో జన్మించిన వ్యక్తుల జీవితం గురించి వివరంగా తెలుసుకుందాం. ఇవి మూలాలు , పుట్టిన తేదీ సంఖ్యాశాస్త్రం ప్రకారం ఏ నెలలోనైనా 9, 18 , 27 తేదీలలో జన్మించిన వ్యక్తుల రాడిక్స్ సంఖ్య అంటే మూల సంఖ్య 9 గా ఉంటుంది. ఈ రాడిక్స్ సంఖ్య ఉన్న వ్యక్తుల పాలక గ్రహం కుజుడు. 9వ సంఖ్య ఉన్న వ్యక్తుల స్వభావం ఎలా ఉంటుందంటే 9వ రాడిక్స్ సంఖ్య గల వ్యక్తుల స్వభావం అత్యంత కోపం. వీరికి చాలా త్వరగా కోపం వచ్చేస్తుంది. చిన్న చిన్న విషయాలకే కోపాన్ని వ్యక్తం చేస్తారు. కోపంగా ఎల్లప్పుడూ కనిపిస్తారు. అదే విధంగా వీరి కోపం క్షణంలోనే తగ్గిపోతుంది. తర్వాత తమ కోపానికి మనస్తాపం చెందుతారు. అయితే.. వీరు ఎప్పుడూ కోపంతో ఎటువంటి నిర్ణయాలు తీసుకోరు. అందరికీ సహాయం చేసే గుణం 9 మూల సంఖ్య ఉన్న వ్యక్తులు చాలా సహాయకారిగా ఉంటారు. ఎవరైనా అవసరంలో ఉంటే..నేను ఉన్నా అంటూ ఆదుకుంటారు. ప్రతి ఒక్కరికీ సహాయం చేయడానికి ఇష్టపడతారు. వీరు తమ కుటుంబ సభ్యులను అమితంగా ప్రేమిస్తారు. వారికీ సేవ చేయడానికి ఇష్టపడతారు. అంతే కాదు ఈ వ్యక్తులు మంచి మాటకారి. తమ మాటలతో అందరినీ సంతోషపరుస్తారు. నిజం మాట్లాడడానికి ఇష్టపడతారు 9 మూల సంఖ్య ఉన్న వ్యక్తులు ఎల్లప్పుడూ నిజం మాట్లాడటానికి ఇష్టపడతారు. ఈ ప్రవర్తన కారణంగా వీరికి చాలా మంది దూరంగా ఉంటారు. అయినప్పటికీ వీరు ఎల్లప్పుడూ సత్యాన్నే సమర్థిస్తారు. నిజం మాట్లాడే గుణం, ముక్కు సూటి తనం వీరి సొంతం. అంతే కాదు వీరు తమ భాగస్వామితో చాలా సన్నిహిత సంబంధాన్ని కొనసాగిస్తారు. ప్రేమిస్తారు.


# డీప్ ఫ్రైలు చేసుకునే వారికోసం నిపుణుల సలహా..




వానాకాలం ప్రారంభమైతే చాలు, వేడివేడి పకోడీలు, కప్పు టీ రుచి చూడాలని చాలా మంది కోరుకుంటారు. అయితే, ఈ రుచులను ఆరోగ్యానికి హానికరం కాకుండా ఎలా ఆస్వాదించాలో అనే సందేహం కలుగుతుంది. డీప్-ఫ్రై చేయడం ఆరోగ్యకరమైన వంట పద్ధతి కాకపోయినా, సరైన నూనెలను ఎంచుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యల రిస్క్ తగ్గించవచ్చు అని వైద్య నిపుణులు అంటున్నారు.డీప్ ఫ్రైయింగ్ చేయడానికి అధిక స్మోక్ పాయింట్ ఉన్న నూనెలను ఎంచుకోవాలని నిపుణులు సూచించారు. అధిక వేడికి ఆక్సిడైజ్ అయ్యే సీడ్ ఆయిల్స్‌ను నివారించాలని చెప్తున్నారు. నూనె స్మోక్ పాయింట్ అంటే, ఆ నూనె విచ్ఛిన్నం కావడం, దాని ద్వారా వచ్చే పొగవల్ల విడుదలయ్యే ఉష్ణోగ్రత. నూనె స్మోక్ పాయింట్ వద్దకు చేరినప్పుడు, అది ఆక్సిడైజ్ అవ్వడం ప్రారంభించి అనారోగ్యకరమైన సమ్మేళనాలను ఉత్పత్తి చేస్తుంది. డీప్ ఫ్రైయింగ్ కోసం అధిక స్మోక్ పాయింట్ (సాధారణంగా 400 డిగ్రీల ఫారెన్‌హీట్ లేదా అంతకంటే ఎక్కువ) అవసరం, నూనె విచ్ఛిన్నం కాకుండా, అనారోగ్యకరమైన సమ్మేళనాలుగా మారకుండా ఇది తోడ్పడుతుంది. రిఫైన్డ్ కొబ్బరి నూనె: ఇది సంతృప్త కొవ్వులను కలిగి ఉంటుంది. దీని స్మోక్ పాయింట్ సుమారు 400 డిగ్రీల ఫారెన్‌హీట్. డీప్ ఫ్రైయింగ్‌కు ఇది స్థిరమైన ఎంపిక. రిఫైన్డ్ ఆలివ్ ఆయిల్: మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. దీని స్మోక్ పాయింట్ 465 డిగ్రీల ఫారెన్‌హీట్. అయితే, ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్ డీప్ ఫ్రైయింగ్‌కు పనికిరాదు. దానికి తక్కువ స్మోక్ పాయింట్ ఉంది. నెయ్యి: చిన్నపాటి వంటగదులలో విస్తృతంగా లభించే నెయ్యి స్మోక్ పాయింట్ 450 డిగ్రీల ఫారెన్‌హీట్. అధిక వేడితో వండే వంటకాలకు ఇది గొప్ప ఎంపిక. అవకాడో నూనె: అన్నింటిలోనూ అత్యధిక స్మోక్ పాయింట్, అంటే 520 డిగ్రీల ఫారెన్‌హీట్, అవకాడో నూనెకు ఉంది. ఇది ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంది. ఈ నూనెల జోలికి పోవద్దు.. సన్‌ఫ్లవర్, సోయాబీన్, కెనోలా వంటి సీడ్ ఆయిల్స్‌ను నివారించాలని వైద్యులు సూచించారు. వీటిలో పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. అధిక ఉష్ణోగ్రత వద్ద వేడిచేసినప్పుడు అవి ఆక్సిడైజ్ అవుతాయి.

తీవ్రమైన వ్యాధులకు ఇవే కారణం.. కార్డియాలజిస్ట్ డా. అలోక్ చోప్రా ఆక్సిడైజ్ అయిన సీడ్ ఆయిల్స్ వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. ఈ ఆక్సిడైజ్ అయిన నూనెలను ఆహారంగా తీసుకున్నప్పుడు, అవి శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ను అందిస్తాయి. ఇది మంట, కణాలకు నష్టం కలిగిస్తుంది. దీనికి గుండె జబ్బులు, ఊబకాయం, క్యాన్సర్ వంటి వివిధ రకాల వ్యాధులతో సంబంధం ఉంది. వీటిలో అధిక మొత్తంలో ఒమేగా-6 కొవ్వు ఆమ్లాలు (ప్రధానంగా లినోలెయిక్ ఆమ్లం) ఉండటం వల్ల శరీర సమతుల్యత దెబ్బతింటుంది. ఇది మంటను ప్రోత్సహిస్తుంది. కొలెస్ట్రాల్‌ను కూడా దెబ్బతీస్తుంది. వీటిలో ట్రాన్స్ ఫ్యాట్స్ కూడా ఉంటాయి. అవి పైన పేర్కొన్న తీవ్రమైన వ్యాధులతో సంబంధం కలిగి ఉంటాయి.

# టీవీలో తండేల్ మూవీ ప్రీమియర్ షో.. రాజు ఎప్పుడొస్తున్నాడంటే..!



నాగ్ చైతన్య కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన చిత్రం తండేల్. యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి కలయి కలో వచ్చిన 'తండేల్'చిత్రాన్ని చందూ మొండేటి తెరకెక్కిం చగా, ఈ మూవీకి వచ్చిన ఆదరణ అంతా ఇంతా కాదు. ఈ చిత్రం రూ.106 కోట్లకు పైగా ప్రపంచ వ్యాప్తంగా గ్రాస్ వసూల్ చేసిందని తండేల్ నిర్మాతలు ప్రకటించారు. రూ.70 కోట్లతో ఈ చిత్రాన్ని బన్నీ వాసు నిర్మించారు. గీతా ఆర్ట్స్ అధినేత, టాలీవుడ్ అగ్ర నిర్మాత అల్లు అరవింద్ సమర్పించిన సంగతి తెలిసిందే. లవ్, యాక్షన్, దేశభక్తి మిళితమైన ఈ చిత్రం ఆడియెన్స్ నుంచి సూపర్బ్ రెస్పాన్స్ ను సొంతం చేసుకుంది. థియేటర్ల వద్ద 'తండేల్' మూవీ కలెక్షన్ల ప్రభంజనం సృష్టించగా, అటు ఓటీటీలోనూ మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఈ చిత్రం ఇప్పుడు బుల్లితెర ప్రేక్షకులను కూడా అలరించడానికి సిద్ధంగా ఉంది. జూన్ 29న, 2025న సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో టెలివిజన్ ప్రీమియర్ కి రెడీ అయింది. ఈ మేరకు సదరు సంస్థ అధికారికంగా ప్రకటిస్తూ తమ సోషల్ మీడియాలో పోస్టు చేసింది.ఈ క్రమంలో చైతన్య, సాయి పల్లవి జంట రెండు తెలుగు రాష్ట్రాల టీవీ ఛానళ్లలో సందడి చేయనున్నారు. ఆదివారం రోజు ఈ జంట ప్రేక్షకులకి మంచి వినోదం పంచనున్నారు. తండేల్ సినిమాలో మ్యూజిక్‌తో పాటు చైతన్య, సాయి పల్లవి నటనకు కూడా విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. మొత్తమ్మీద ఈ డీసెంట్ ఎమోషనల్ లవ్ డ్రామా, బలమైన ఎమోషన్స్ అండ్ ఫీల్ గుడ్ సీన్స్ తో సాగుతూ బాగా ఆకట్టుకుంది. డీసెంట్ టేకింగ్ సినిమా స్థాయిని పెంచాయి. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి స్వరాలు అందించారు. సంగీతం కూడా ఎంతగానో ఆకట్టుకుంది. తండేల్ సక్సెస్ తో ఫుల్ జోష్ లో ఉన్న చైతన్య తన తర్వాతి సినిమాను కార్తీక్ దండు దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. చైతూ కెరీర్లో 24(%చీజ%24)వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ మూవీ థ్రిల్లర్ గా తెరకెక్కుతోంది. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు వృష కర్మ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారు.





# ప్రేమలు బ్యూటీకి బర్త్‌డే విషెస్ తెలిపిన 'డ్యూడ్' టీమ్

ప్రేమలు సినిమాతో స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది మల్లు బ్యూటీ మమితా బైజు. ఈ భామ ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఆమె ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం డ్యూడ్ ఈ సినిమాకు కీర్తిశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. 'లవ్ టుడే' 'డ్రాగన్' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. నేడు మమితా బైజు బర్త్‌డే కావడంతో ఆమెకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. కొత్త పోస్టర్‌ని పంచుకుంది. ఈ సినిమాలో మమితా కురల్ అనే పాత్రలో నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

# తెలుగమ్మాయిలకు 20 శాతమే.. ఇంత కష్టం ఎక్కడా లేదు



టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలకు అవకాశాలు చాలా తక్కువ అనే కంప్లైంట్ ఎప్పటి నుంచో ఉంది. ఇది ఇప్పటికీ కొనసాగుతుందని చెబుతోంది యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలకు 20 శాతం మాత్రమే అవకాశాలు వస్తాయని..దాని కోసమే పదేళ్లు కొట్టుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇండస్ట్రీలో తెలుగు అమ్మాయిల పరిస్థితి ఎలా ఉంటుందో వివరించింది. 'తెలుగు అమ్మాయిలను చూస్తే గర్వంగా అనిపిస్తుంది. ఇండియాలో ఏ లాంగ్వేజ్ అమ్మాయికి అయినా ఇంత కష్టం ఉండదేమో. తెలుగులో మన వాళ్లకు 20 శాతం మాత్రమే అవకాశం ఉంటుంది. వందలో 80 సినిమాలకు పరభాష హీరోయిన్లనే తీసుకుంటారు. అదే మలయాళం, తమిళ్ తో పాటు ఇతర భాషల్లో చూస్తే..అక్కడ లోకల్ అమ్మాయిలకే 80 శాతం అవకాశం ఇస్తారు. ఇలా ఎక్కడ చూసిన తెలుగు అమ్మాయిలకు 20 శాతం మాత్రమే చాన్స్ ఉంటుంది. ఇందులోనే తమ టాలెంట్‌ని నిరూపించుకోవాలి. చిన్నప్పటి నంచి సినిమాలు చూసి ఇష్టం పెంచుకొని, పెరెంట్స్ ఒప్పించి ఇండస్ట్రీలోకి వస్తే.. ఈ 20 శాతం కోసమే పదేళ్లు కొట్టుకోవాలి. మిగతావాళ్లకి లోకల్‌తో పాటు మన దగ్గర కూడా 80 శాతం అవకాశాలు ఉంటాయి. అందుకే నాకు తెలుగు అమ్మాయిలను చూస్తే గర్వంగా ఉంటుంది. వాళ్లు మానసికంగా చాలా స్ట్రాంగ్‌గా ఉంటారు' అని అనన్య చెప్పుకొచ్చింది. ఇక ఇదే ఇంటర్వ్యూలో పొట్టేల్ సినిమాకు గాను తనకు వచ్చిన స్పెషల్ జ్యూరీ గద్దర్ అవార్డు గురించి మాట్లాడుతూ.. ఇలాంటి అవార్డు తనకు వస్తుందని అసలు ఊహించలేదని చెప్పింది. 'అవార్డులు ప్రకటించిన రోజు నా మూడ్ బాగోలేదు. ఇంట్లో పడుకొని ఉన్నాను. లేవగానే.. పాజిటివ్ విషయం గురించి థింక్ చేస్తూ.. ఏదైనా అవార్డు వస్తే బాగుండు అనుకున్నాను. అయితే ఆ రోజు గద్దర్ అవార్డులు ప్రకటిస్తారనే విషయం కూడా నాకు తెలియదు. బెడ్ రూం నుంచి హాల్‌లోకి రాగానే.. టీవీలో గద్దర్ అవార్డుల ప్రకటన న్యూస్ చూస్తూ.. 'ఇంత మంచి సినిమాలు చేస్తున్నా..నాక్కుడా వస్తే బాగుండు' కదా అని అన్నయ్యతో చెబుతున్నా..అంతలోనే నాకు పొట్టేల్ మూవీ నిర్మాత ఫోన్ చేసి'మన సినిమాకు అవార్డు వచ్చింది' అని చెప్పగానే షాక్ అయ్యాను. ఆరేళ్ల కెరీర్‌లో మీడియాతో పాటు ఇండస్ట్రీలో చాలా మంది సపోర్ట్ చేశారు. అందుకే నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను' అని అనన్య చెప్పుకొచ్చింది



# విజయ్ దేవరకొండపై అట్రాసిటీ కేసు!

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండపై కేసు నమోదు అయింది. ఏప్రిల్ 26న జరిగిన రెట్రో సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో గిరిజనులను అవమానించేలా మాట్లాడారంటూ విజయ్‌పై గిరిజన సంఘం నాయకుడు అశోఖ్ కుమార్ రాథోడ్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద విజయ్ దేవరకొండపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హీరో వ్యాఖ్యలపై విచారణ జరిపుతున్నట్లు వారు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న హైదరాబాద్‌లో తమిళ హీరో సూర్య హీరోగా నటించిన రెట్రో సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ ఈవెంట్‌కి విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా వెళ్లాడు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి గురించి మాట్లాడుతూ.. ఇండియా పాకిస్తాన్‌పై దాడి చేయాల్సిన అవసరం లేదు.. అక్కడి ప్రజలకే విరక్తి వచ్చి పాక్ ప్రభుత్వంపై తిరగబడతారు. 500 ఏళ్ల క్రితం ట్రైబల్స్ కొట్టుకున్నట్లు.. బుద్ధి లేకుండా, కనీస కామన్ సెన్స్ లేకుండా ఇలాంటి పనులు చేస్తున్నారు. మనమంతా ఐకమత్యంగా ఉండాలి' అని విజయ్ అన్నారు. ఈ వ్యాఖ్యలు గిరిజనులను ఉగ్రవాదులతో పోల్చాయని, వారిని అవమానించాయని గిరిజన సంఘం నాయకుడు అశోక్‌కుమార్ రాథోడ్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేడయంతో విజయ్‌పై కేసు నమోదు చేశారు. ఈ వివాదంపై విజయ్ అప్పుడే స్పందించాడు. తాను ట్రైబ్స్ అనే పదం వాడిన మాట నిజమే కానీ.. దాని అర్థం గిరిజనులు కాదని చెప్పారు. 'వందల ఏళ్ల కిందట సమాజం, ప్రజలు గుంపులుగా వ్యవస్థీకృతమై ఉండేవాళ్లని నా ఉద్దేశం. అలాంటి సమయంలో రెండు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకునేవి. ఆ సెన్స్‌లోనే ట్రైబ్స్ అనే పదం వాడాను. అంతేకానీ, ఇప్పుడున్న షెడ్యూల్ ట్రైబ్‌ని ఉద్దేశించి నేను వ్యాఖ్యలు చేయలేదు. అయినా కూడా నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకొని హర్ట్ అయితే విచారం వ్యక్తం చేస్తున్నాను' అని విజయ్ అప్పుడే సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చాడు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.